

4 లో

వైభవంగా ప్రారంభమైన మాతమ్మ తల్లి జాతర

RNI : APTEL/2023/87662

# సింధూర దర్శిని

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం అవినీతి పై సమరం

WWW.SINDHURADARSINI.COM WWW.EPAPER.SINDHURADARSINI.COM

**విలేకరులు కావలెను**


సింధూరదర్శిని జాతీయ తెలుగు దినపత్రికలో జిల్లాల వారీగా పనిచేయుటకు జిల్లా ఇన్చార్జీలు మరియు మండలాల వారీగా పనిచేయుటకు విలేకరులు కావలెను. ఎలాంటి వేతనం ఇవ్వబడదు. యాడ్స్ పై ఆకర్షణీయమైన కమిషన్ ఇవ్వబడును. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వివరాల కొరకు బయోడేటాతో క్రింది నంబర్‌ను సంప్రదించండి.

సెల్ నెంబర్ : 7 5 6 9 6 7 7 1 7 0

ప్రచురణ: తిరుపతి సంపుటి:3 సంచిక :239 సంపాదకులు: కలిచేటి వెంకయ్య శనివారం 25 జులై 2026 పేజీలు: 8 వెల:2

Circulated At :Tirupathi, Chittoor, Kadapa, SPSR Nellore, karnool, Prakasam, Hydrabad

# పేపర్ లీక్‌పై కేంద్రం కఠిన చర్యలు..





భారీ జరిమానా, జైలు శిక్ష పెంపునకు సిద్ధం?

పేపర్ లీక్ చట్టానికి కేంద్రం సవరణలు

ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు ప్రతిపాదన

శిక్షలు, జరిమానాలు పెంచే యోచన

నేడు కేబినెట్ ఆమోదం పొందే అవకాశం

సోమవారం లోక్‌సభకు సవరణ బిల్లు వచ్చే ఛాన్స్

**న్యూఢిల్లీ:** నీట్ పేపర్ లీక్ వివాదంపై దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయానికి సిద్ధమైంది. పేపర్ లీక్‌లు, పరీక్షల్లో అక్రమాలను అరికట్టేందుకు ప్రస్తుతం అమల్లో ఉన్న పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) చట్టం-2024ను మరింత కఠినతరం చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు చట్ట సవరణలకు శుక్రవారం కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రతిపాదిత సవరణల్లో పేపర్ లీక్ కేసుల విచారణ కోసం ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసే నిబంధనను చేర్చనున్నట్లు తెలుస్తోంది. అలాగే నిందితులకు ప్రస్తుతం ఉన్న జైలు శిక్షలు,

మిగతా 2లో...

## విద్యార్థులను దేశ శత్రువుల్లా చూస్తోంది..

కేంద్రంపై సోనియా తీవ్ర విమర్శలు

నీట్ నిరసనలపై పోలీసు చర్యలను ఖండించిన సోనియా

జులై 20 నాటి ఘటన దేశాన్ని కలచివేసిందని వ్యాఖ్య

లాఠీచార్జీ, టియర్ గ్యాస్ ప్రయోగంపై ఆగ్రహం

విద్యా రంగాన్ని కేంద్రం నిర్వీర్యం చేసిందని ఆరోపణ

ప్రభుత్వ పాఠశాలల మూత.. ప్రైవేటు పాఠశాలలు పెరిగాయని విమర్శ

ప్రధాన్ రాజీనామా చేయకపోవడాన్ని తప్పుబట్టిన కాంగ్రెస్ అగ్రనాయకురాలు



**న్యూఢిల్లీ:** నీట్ పేపర్ లీక్‌పై దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులను కేంద్ర ప్రభుత్వం దేశ శత్రువుల్లా చూస్తోందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ ఆరోపించారు. విద్యార్థుల ధైర్యానికి ప్రభుత్వం జవాబుదారీతనంతో స్పందించాల్సిందిపోయి, లాఠీచార్జీలు, బాష్పవాయువు ప్రయోగంతో అణచివేస్తోందని

మిగతా 2లో...

## పీఓకేలో నరమేధం..

ఐరాసలో పాకిస్థాన్‌ను ఏకిపారేసిన భారత్

పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో అణచివేతపై ఐరాస మౌనాన్ని తప్పుబట్టిన భారత్

ఇతర దేశాలపై స్పందించే ఐరాస.. పాక్ దురాగతాలను ఎందుకు పట్టించుకోవట్లేదని నిలదీత

పీఓకేలో నిరసనకారుల హత్యలు, ఇమ్రాన్ ఖాన్ అరెస్ట్‌ను ప్రస్తావించిన భారత్

జమ్మూకశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని మరోసారి స్పష్టీకరణ

పాకిస్థాన్‌లో సైన్యం రాజ్యాంగ కుట్రకు పాల్పడిందని ఆరోపణ




## మీకు మార్కులు తగ్గితే లోకేశ్‌కు మార్కులు తగ్గినట్టే

రంపచోడవరంలో చంద్రబాబు

రంపచోడవరంలో మెగా పేరెంట్-టీచర్ మీటింగ్‌లో పాల్గొన్న ముఖ్యమంత్రి

'డ్రగ్స్ వద్దు బ్రో' హ్యాండ్‌బుక్, 'బడి కోసం' డోనర్ వెబ్ పోర్టల్ ఆవిష్కరణ

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని వెల్లడి

**రంపచోడవరం, సింధూరదర్శిని:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మార్కులు తగ్గితే, అది విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు మార్కులు తగ్గినట్లేనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. లోకేశ్ ఏరికోరి విద్యాశాఖ బాధ్యతలు స్వీకరించారని, విద్యా రంగంపై ఆయనకున్న నిబద్ధతకు ఇది నిదర్శనమని అన్నారు. విద్యారంగంలో మార్పు తీసుకురావాలన్న తపనతో ఆయన పనిచేస్తున్నారని, ఇప్పటికే ప్రభుత్వ స్కూళ్లలో కనిపిస్తున్న మార్పులు చూస్తుంటే ఆనందంగా ఉందని చంద్రబాబు వ్యాఖ్యానించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా

మిగతా 2లో...






## కోర్టు దృశ్యాలను ప్రసారం చేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

కీలక ఆదేశాలు జారీ

కోర్టు విచారణలను విచ్చలవిడిగా, అసంపూర్తిగా ప్రసారం చేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

అనుమతి లేకుండా వీడియోలను అప్‌లోడ్ చేయడంపై నిషేధం

కోర్టులు ఎంటర్‌టైన్‌మెంట్ ఛానెళ్లు కావు అన్న జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి

**సింధూరదర్శిని:** కోర్టు విచారణలకు సంబంధించిన ఆడియో, వీడియో రికార్డింగ్‌లను సోషల్ మీడియాలో విచ్చలవిడిగా, అసంపూర్తిగా ప్రసారం చేయడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. కోర్టు కార్యకలాపాల వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడాన్ని సీసాలో నుంచి బయటకు వచ్చిన భూతంతో

మిగతా 2లో...

## పలమనేరు క్యాంపు నుంచి పార్వతీపురానికి కుంకీ ఏనుగుల తరలింపు

మార్గమధ్యంలో మంగళగిరి వద్ద స్వాగతం పలికిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

కుంకీలకు స్వయంగా ఆహారం అందించిన ఉప ముఖ్యమంత్రి - జెండా ఊపి గుచ్చిమి క్యాంపుకు సాగనంపిన పవన్ కళ్యాణ్

**మంగళగిరి, సింధూరదర్శిని:** పార్వతీపురం మన్యం జిల్లాలో మానవ-ఏనుగు సంఘర్షణల నివారణ చర్యలను బలోపేతం చేసే దిశగా పలమనేరు ముసలమడుగు ఏనుగుల శిబిరం నుంచి గుచ్చిమి ఏనుగుల శిబిరానికి తరలిస్తున్న శిక్షణ పొందిన కుంకీ ఏనుగులు జయంత్, అభిమన్యులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ మంగళగిరి క్యాంపు కార్యాలయం వద్ద స్వాగతం పలికారు. గజరాజులకు మార్గమధ్యంలో పూలు చల్లి స్వాగతం పలికిన ఉప ముఖ్యమంత్రి, వాటికి స్వయంగా ఆహారం అందజేశారు. అనంతరం గుచ్చిమి శిబిరానికి బయలుదేరిన కుంకీల రెండో అంచె



ప్రయాణాన్ని జెండా ఊపి సాగనంపారు. ఈ సందర్భంగా ప్రయాణంలో కుంకీల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై అటవీ శాఖ అధికారులకు పవన్‌కళ్యాణ్ దిశానిర్దేశం చేశారు. గుచ్చిమి క్యాంపునకు చేరిన అనంతరం నిపుణుల పర్యవేక్షణలో అక్కడి వాతావరణ పరిస్థితులకు అలవాటుపడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జయంత్, అభిమన్యుల సేవలు పార్వతీపురం పరిసర ప్రాంతాల్లో మానవ-ఏనుగు ఘర్షణల నియంత్రణకు ఎంతో ఉపయోగపడనున్నాయని ఈ సందర్భంగా శ్రీ పవన్ కళ్యాణ్ తెలిపారు. ప్రజల భద్రత, రైతుల పంటల రక్షణ, వన్యప్రాణుల సంరక్షణ లక్ష్యాలను కూటమి

మిగతా 2లో...

## పీఓకేలో నరమేధం.. ఐరాసలో పాకిస్థాన్‌ను ఏకిపారేసిన భారత్



సింధూరదర్శిని: పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) సహా పాకిస్థాన్ వ్యాప్తంగా జరుగుతున్న తీవ్ర మానవ హక్కుల ఉల్లంఘనలపై ఐక్యరాజ్యసమితి (ఐరాస) మౌనం వహించడాన్ని భారత్ తీవ్రంగా తప్పుబట్టింది. ఇతర దేశాల్లోని ఇలాంటి పరిణామాలపై గొంతెత్తే ఐరాస.. పాకిస్థాన్ విషయానికి వచ్చేసరికి ఎందుకు మౌనంగా ఉంటోందని నిలదీసింది. ఐరాస భద్రతా మండలిలో జరిగిన ఓ చర్చా కార్యక్రమంలో పాకిస్థాన్ మరోసారి కశ్మీర్ అంశాన్ని లేవనెత్తగా, భారత్ ఘాటుగా స్పందించింది. ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి పి. హరీశ్ మాట్లాడుతూ.. 'శాంతియుత వివాద పరిష్కార యంత్రాంగాలను బలోపేతం చేయడం' అనే అంశంపై జరిగిన చర్చలో పాకిస్థాన్ నిజస్వరూపాన్ని ప్రపంచం ముందుంచారు. "పాక్ ఆక్రమిత జమ్మూ కశ్మీర్‌లో జరుగుతున్న పరిణామాలు పాకిస్థాన్ అసలు నైజాన్ని పూర్తిగా బట్టబయలు చేస్తున్నాయి. అక్కడ కశ్మీరీల ప్రాథమిక హక్కులు, భావప్రకటనా స్వేచ్ఛను పాకిస్థాన్ దశాబ్దాలుగా కాలరాస్తోంది. ఇది ఇప్పుడు జరుగుతున్నది కాదు, దాదాపు ఎనిమిది దశాబ్దాలుగా పాక్ అనుసరిస్తున్న వ్యూహంలో భాగం" అని హరీశ్ స్పష్టం చేశారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న కశ్మీరీలను పాక్ ప్రభుత్వం కిరాతకంగా అణచివేస్తోందని భారత్ ఆరోపించింది. "గత జూన్ నుంచి ఇప్పటివరకు పాక్ భద్రతా దళాల చేతుల్లో 34 మంది కశ్మీరీలు ప్రాణాలు కోల్పోయారు. ఇటీవలే జులై 14న తారార్‌ఖల్‌లో ఆరుగురు కశ్మీరీలను పాక్ దళాలు హతమార్చాయి" అని హరీశ్ వివరించారు. పాకిస్థాన్‌లో ప్రజాస్వామ్యం ఎలా ఖూనీ అవుతోందో కూడా భారత్ ఎత్తిచూపింది. మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌ను కల్పిత ఆరోపణలతో జైల్లో పెట్టడం, ఆయన పార్టీ పీటీఐని ఎన్నికల్లో పాల్గొనకుండా అడ్డుకోవడం వంటి చర్యలను ప్రస్తావించింది. దేశ చరిత్రలో నిరంతరం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో పాలన సాగిస్తున్న పాక్ సైన్యం.. రాజ్యాంగంలోని 27వ సవరణ ద్వారా రాజ్యాంగ కుట్రకు పాల్పడిందని విమర్శించింది. ఈ సవరణ ద్వారా సైనిక ఉన్నతాధికారులకు జీవితకాలం పాటు క్రిమినల్ విచారణ నుంచి మినహాయింపు కల్పించారని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థను పూర్తిగా నాశనం చేసిందని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మతపరమైన కల్పిత కథనాలను ప్రచారం చేయడం మానుకుని, పాకిస్థాన్ తన సొంత సమస్యలపై దృష్టి పెడితే మంచిదని హరీశ్ హితవు పలికారు. "జమ్మూ కశ్మీర్ ఎల్లప్పుడూ భారత్‌లో అంతర్భాగం. ఈ వాస్తవాన్ని పాకిస్థాన్ జీర్ణించుకోలేకపోవచ్చు. ఇక్కడ పరిష్కారం కాని ఏకైక సమస్య.. భారత సార్వభౌమ భూభాగాన్ని పాకిస్థాన్ చట్టవిరుద్ధంగా ఆక్రమించు కోవడమే" అని ఆయన స్పష్టం చేశారు.

## పేపర్ లీక్‌పై కేంద్రం కఠిన చర్యలు..

(మొదటిపేజీ తరువాయి)

జరిమానాలను మరింత పెంచే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు. ప్రస్తుతం పేపర్ లీక్ కేసుల్లో దోషులుగా తేలితే మూడు నుంచి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. వ్యవస్థీకృత నేరాల్లో ఐదు నుంచి పది సంవత్సరాల జైలు, కనీసం రూ.కోటి జరిమానా నిబంధన అమల్లో ఉంది. కేబినెట్ ఆమోదం అనంతరం సవరణ బిల్లును సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టే అవకాశం ఉంది. గురువారం ప్రధాని నరేంద్ర మోదీ కూడా పేపర్ లీక్‌లపై మరింత కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటుకు ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్లు వెల్లడించారు. పరీక్షల పవిత్రతను కాపాడేందుకు, విద్యార్థుల భవిష్యత్తును రక్షించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గత పదేళ్లలో దేశంలో 150 పేపర్ లీక్‌లు జరిగాయని, ఒక్క కేసులో కూడా శిక్షలు పడలేదని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

## పలమనేరు క్యాంపు నుంచి పార్వతీపురానికి కుంకీ ఏనుగుల తరలింపు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం శాస్త్రీయ, మానవీయ విధానాలతో చేపడుతున్న చర్యల్లో భాగంగా కుంకీలను తరలిస్తున్నామని అన్నారు.

**– ఒడిశా వైపు నుంచి ఏనుగులు**

ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి ఏనుగుల గుంపులు తరచూ పార్వతీపురం మన్యం జిల్లాలోకి ప్రవేశిస్తూ పంటలు, ఆస్తులకు నష్టం కలిగిస్తున్న నేపథ్యంలో, మానవ-ఏనుగు ఘర్షణల నివారణకు కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా ఈ కుంకీ ఏనుగులను గుచ్చిమి శిబిరానికి తరలిస్తున్నారు. మానవ-ఏనుగు ఘర్షణల నివారణ చర్యల్లో భాగంగా కుంకీ ఏనుగులైన జయంత్, అభిమన్యులను వినియోగిస్తారు.

గతంలో పలమనేరు, చిత్తూరు ప్రాంతాల్లో నిర్వహించిన పలు కీలక ఆపరేషన్లలో ఈ రెండు కుంకీ ఏనుగులు కీలక పాత్ర పోషించాయి. అడవి ఏనుగుల గుంపులను సురక్షితంగా అటవీ ప్రాంతాలకు మళ్లించడంలో ఎంతో చురుకుగా వ్యవహరించాయి.




# విద్యార్థులను దేశ శత్రువుల్లా చూస్తోంది..

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. 'ది హిందూ'లో శుక్రవారం ప్రచురితమైన తన వ్యాసంలో సోనియా గాంధీ కేంద్ర ప్రభుత్వ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. నీట్ పేపర్ లీక్, పరీక్షల వ్యవస్థలో లోపాలు, విద్యా సంస్కరణల కోసం విద్యార్థులు న్యాయమైన డిమాండ్లు చేస్తున్నారని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వం వారిని దేశ భవిష్యత్తుగా కాకుండా శత్రువులుగా చూస్తోందని విమర్శించారు. జులై 20న ఢిల్లీలో జరిగిన ఘటనలను 'అప్రతిష్ఠకరమైన రోజు' సోనియా అభివర్ణించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై ఢిల్లీ పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలు లాఠీచార్జీలు, టియర్‌గ్యాస్ ప్రయోగించాయని ఆరోపించారు. ఇంటికి వెళ్తున్న విద్యార్థులపై కూడా విచక్షణారహితంగా దాడులు చేశారని, గాయాలతో యువత రక్తమోడిన దృశ్యాలు దేశాన్ని కలచివేశాయని అన్నారు. 2020లో సీఏఏ-ఎన్ఆర్‌సీ వ్యతిరేక ఆందోళనల సమయంలో విశ్వ విద్యాలయాల్లో జరిగిన పోలీసు చర్యలు, మహిళా రెజ్లర్ల నిరసన సమయంలో జరిగిన ఘటనలను కూడా ఆమె గుర్తు చేశారు. విద్యార్థులపై బలప్రయోగం ఈ ప్రభుత్వానికి కొత్త కాదని వ్యాఖ్యానించారు. విభేదించే ప్రతి స్వరాన్ని దేశద్రోహంగా ముద్ర వేయడం అలవాటుగా మార్చుకుందని ప్రభుత్వాన్ని సోనియా విమర్శించారు. విద్యార్థుల ఉద్యమాన్ని కూడా అదే కోణంలో చూపించే ప్రయత్నం చేస్తోందన్నారు. విమర్శలను కుట్రలుగా చిత్రీకరించకుండా, విద్యార్థులు ఎందుకు రోడ్డెక్కారో ఆత్మపరిశీలన చేసుకోవాలని కేంద్రానికి సూచించారు. విద్యా రంగంలో కేంద్ర ప్రభుత్వం వెనక్కి వెళ్లిందని ఆమె ఆరోపించారు. గత 12 ఏళ్లలో ప్రభుత్వ పాఠశాల విద్యకు కేటాయించే బడ్జెట్ వాటా 50శాతం, ఉన్నత విద్యకు 33శాతం తగ్గింద న్నారు. ఈ కాలంలో దాదాపు లక్ష ప్రభుత్వ పాఠశాలలు మూతపడగా, 43 వేల ప్రైవేటు పాఠశాలలు ప్రారంభమ య్యాయని పేర్కొన్నారు. దీంతో నాణ్యమైన ప్రభుత్వ విద్య సామాన్యులకు అందకుండా పోయిందని అన్నారు. జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ)ను బలోపేతం చేయాలని పార్లమెంటరీ స్థాయీ సంఘం చేసిన సిఫార్సులను కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పట్టించుకోలేదని సోనియా విమర్శించారు. పేపర్ లీక్‌ల వంటి తీవ్రమైన వైఫల్యాలు జరిగినా ఆయన రాజీనామా చేయకపోవడం ప్రజల్లో మరింత ఆగ్రహం పెంచింద న్నారు. విద్యార్థుల ఉద్యమానికి మద్దతుగా నిలవడం దేశ ప్రజల నైతిక, రాజకీయ, రాజ్యాంగబద్ధ బాధ్యత అని సోనియా గాంధీ పేర్కొన్నారు. వారి భవిష్యత్తును కాపా డేందుకు ప్రభుత్వం జవాబుదా రీతనంతో వ్యవహరించాలని డిమాండ్ చేశారు.

# మీకు మార్కులు తగ్గితే లోకేశ్‌కు మార్కులు తగ్గినట్టే







(మొదటిపేజీ తరువాయి)

రంపచోడవరంలో నిర్వహించిన 'మెగా పేరెంట్-టీచర్స్ మీటింగ్' సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "కొత్త జిల్లా ఏర్పాటయ్యాక తొలిసారి ఇక్కడికి వచ్చాను. ఇవాళ నేను కూడా టీచర్‌ను అయ్యాను, నేర్చుకోవడానికి విద్యార్థిని అయ్యాను, తల్లిదండ్రులకు చెప్పడానికి మెంటర్‌గా మారాను" అని అన్నారు. పిల్లల భవిష్యత్తు బాధ్యతను తల్లిదండ్రులిద్దరూ తీసుకోవాలని, అప్పుడే వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందని హితవు పలికారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో మార్పులు ప్రారంభమయ్యాయని, దీని ఫలితంగానే ప్రైవేట్ పాఠశాలల నుంచి 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారని, ఇదే ప్రభుత్వ స్కూళ్ల సత్తా అని గర్వంగా ప్రకటించారు. గిరిజన ప్రాంతాల్లోని పిల్లలు మట్టిలో మాణిక్యాలని, వారికి అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని, రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము జీవితం అందరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు.

**'బడి కోసం' పోర్టల్ ఆవిష్కరణ.. వెల్లువెత్తిన విరాళాలు**

ఈ కార్యక్రమంలో భాగంగా, పాఠశాల విద్యాశాఖ రూపొందించిన 'డ్రగ్స్ వద్దు బ్రో' హ్యాండ్‌బుక్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. అనంతరం దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు ఉద్దేశించిన 'బడి కోసం' డోనర్ వెబ్ పోర్టల్‌ను ప్రారంభించారు. పోర్టల్ ప్రారంభించిన వెంటనే రంపచోడవరం హైస్కూల్‌కు మీ-సేవ ఆపరేటర్ చిట్టిబోయిన ఉదయ్ కుమార్ లక్ష రూపాయల విరాళం ప్రకటించగా, నెల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు పారిశ్రామికవేత్త పూర్ణచంద్రరావు రూ.4 కోట్లు విరాళం ప్రకటించడం సభలో హర్షాతిరేకాలు నింపింది.

**ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ పాలన**

రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, మనసుంది కాబట్టే 'తల్లికి వందనం' వంటి పథకాలను అమలు చేస్తున్నామని చంద్రబాబు తెలిపారు. గత ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసిందని, ప్రభుత్వ ఆస్తులను సైతం తాకట్టు పెట్టిందని విమర్శించారు. తాము ఆ ఆస్తులను విడిపిస్తూ, అధిక వడ్డీల భారాన్ని తగ్గించే ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితి నుంచి, ప్రస్తుతం ప్రతినెలా ఒకటో తేదీన ఠంఛనుగా జీతాలు, పెన్షన్లు ఇస్తున్నామని గుర్తుచేశారు. ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతూనే, సంక్షేమం-అభివృద్ధిని సమన్వయం చేస్తున్నామన్నారు.

**ఉపాధ్యాయుల సంక్షేమం, యువతకు భవిష్యత్**

ఉపాధ్యాయులకు సముచిత గౌరవం ఇస్తున్నామని, పారదర్శక కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు నిర్వహిస్తున్నామని సీఎం తెలిపారు. గత ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ నిర్వహించని గత ప్రభుత్వానికి భిన్నంగా, తాము అధికారంలోకి రాగానే మెగా డీఎస్సీని పూర్తిచేశామన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో నియమితులైన కొత్త ఉపాధ్యాయులను అభినందించారు. విశాఖకు గూగుల్ వంటి సంస్థలను తీసుకువస్తున్నామని, ఆగస్టు 1న ప్రధాని మోదీ చేతుల మీదుగా భోగాపురం ఎయిర్‌పోర్టుకు శంకుస్థాపన జరుగుతుందని వెల్లడించారు. విద్యార్థులు ఇష్టపడి చదివితే, రాష్ట్రంలోనే పెద్ద ఉద్యోగాలు కల్పించే బాధ్యత తమదని భరోసా ఇచ్చారు. అనంతరం గంజాయి సాగును నిర్మూలించి ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తామని, జీవో నెంబర్-3పై చర్చించి గిరిజనులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# కోర్టు దృశ్యాలను ప్రసారం చేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

(మొదటిపేజీ తరువాయి)

పోల్చిన ధర్మాసనం, సంబంధిత కోర్టుల ముందస్తు అనుమతి లేకుండా వాటిని పోస్ట్ చేయడం, ఎడిట్ చేయడం లేదా రీ-పోస్ట్ చేయడంపై మధ్యంతర స్టే విధిస్తూ సంచలన ఆదేశాలు జారీ చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరిపింది. సుప్రీంకోర్టు సెక్రటరీ జనరల్ లేదా ఆయా హైకోర్టుల రిజిస్ట్రార్ జనరల్ ముందస్తు అనుమతి లేకుండా విచారణల వీడియోలను ఎక్స్‌ట్రాక్ట్ చేయడం, మార్పులు చేయడం, సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడం లేదా వాటి ద్వారా ఆదాయం పొందడం పూర్తిగా నిషిద్ధమని స్పష్టం చేసింది. అయితే ఈ ఉత్తర్వులు సాధారణ వార్తా కవరేజ్ లేదా జర్నలిజం రిపోర్టింగ్‌పై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపవని, ఇవి భావవ్యక్తీకరణ స్వేచ్ఛను అడ్డుకునే ఉత్తర్వులు కాదని ధర్మాసనం తెలిపింది. విచారణ క్లిప్‌లు వైరల్ కావడంపై వివరణ ఇవ్వాలని మెటా, ఎక్స్ సహా పలు డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లకు అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది.

విచారణ సందర్భంగా జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి మాట్లాడుతూ... కోర్టులు 24 గంటల ఎంటర్‌టైన్‌మెంట్ ఛానెళ్లు కావు అని స్పష్టం చేశారు. వర్చువల్ లింక్‌లు దుర్వినియోగం కాకుండా పరిమిత యాక్సెస్ మాత్రమే ఉండాలని అభిప్రాయపడ్డారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ... ఏఐ టూల్స్ ఉపయోగించి న్యాయమూర్తులు లేదా లాయర్ల మాటలను మార్చి మార్ఫింగ్ చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

# పాఠశాలల అభివృద్ధి,విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం: వేగేశన నరేంద్ర వర్మ

బాపట్ల సింధూరదర్శిని: పాఠశాలల అభివృద్ధి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు పేర్కొన్నారు.

పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం గ్రామంలోని మంతెన సుబ్బరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించిన 'మెగా పేరెంట్-టీచర్ మీటింగ్ 4.0' కార్యక్రమంలో ఎమ్మెల్యే గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఆయన ఆసక్తిగా వీక్షించి, పిల్లల ప్రతిభను అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే విద్యార్థులకు స్వయంగా 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం' వడ్డించారు. ఆ తర్వాత విద్యార్థులతో కలిసి కింద కూర్చొని భోజనం చేస్తూ వారి చదువులు, పాఠశాల సౌకర్యాల గురించి ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే



వేగేశన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ:- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నేరుగా రంపచోడవరం ప్రభుత్వ హైస్కూలు ఍ జూనియర్ కళాశాలలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారని తెలిపారు. పిల్లల పెంపకం మరియు విద్యలో పురోగతి కేవలం ఉపాధ్యాయుల బాధ్యత మాత్రమే కాదు; తల్లిదండ్రుల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరం. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యాధునిక మౌలిక వసతులు కల్పిస్తూ, నాణ్యమైన ఉచిత విద్యను అందించడమే కూటమి ప్రభుత్వం యొక్క ప్రధాన ధ్యేయం." ప్రాథమిక విద్యను మరింత బలోపేతం చేసేందుకు మోడల్ పాఠశాలలను అందుబాటులోకి తెచ్చి, 'తరగతికి ఒక ఉపాధ్యాయుడు' అనే విధానం దిశగా అడుగులు వేస్తున్నామని తెలిపారు. గతంలోలా విద్యార్థుల వస్తువులపై ఏ రాజకీయ నాయకుడి ఫోటోలు వేయకుండా, ఉపాధ్యాయ లోకానికే మార్గదర్శకుడైన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ స్ఫూర్తితో "సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి కిట్లు" ను పంపిణీ చేస్తున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ, ఆర్డీవో, పాఠశాల హెచ్‌ఎం , ఉపాధ్యాయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, విద్యా కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు మరియు ఖాజీపాలెం గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

## తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం

## ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్

గూడూరు( సింధూర దర్శిని) 24 జూలై నెల్లూరు జిల్లా ; ఎన్నికలకు ముందు చెప్పిన విధంగా రెండవ విడత తల్లికి వందనం పథకం ద్వారా గురువారం ప్రభుత్వం తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయడం జరిగిందని ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను మంత్రి నారా లోకేష్ తీర్చిదిద్దుతున్నారని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ వెల్లడించారు.గూడూరు పట్టణంలోని చిల్లకూరు శేషమ్మ మున్సిపల్ హైస్కూల్లో శుక్రవారం తల్లిదండ్రులు ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ విచ్చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారుల సాంస్కృతి కార్యక్రమాలు అందరినీ అలరించాయి. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలను నాటారు మధ్యాహ్నం భోజనం లో చిన్నారులతో కలిసి భోజనం చేశారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చెప్పిన విధంగా సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని రెండో విడత తల్లికి వందనం గురువారం తల్లుల ఖాతాల్లో నగదు జమ చేయడం జరిగిందని తెలిపారు. గతంలో ఎప్పుడూ లేనివిధంగా ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో సమావేశాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టారని , దీనివల్ల తమ పిల్లలు ఎలా చదువుతున్నారో తెలుసుకునే అవకాశం ఉందని అన్నారు. తల్లికి వందనం నగదు రానివారు సచివాలయాల్లో సంప్రదించాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డిఇఓ సనత్ కుమార్, ఎంఈఓ లు మాధవరావు, కాంచన,పాఠశాల కమిటీ చైర్మన్ పోలయ్య ,నాయకులు శ్రీనివాసులు, రహీం,ముత్తుజ ,నాజరుద్దీన్ ,సద్దాం ,అల్లి భాష, రవీందర్ రెడ్డి,చంద్రమౌళి , ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు



గూడూరు( సింధూర దర్శిని) 24 జూలై నెల్లూరు జిల్లా ; గూడూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో శుక్రవారం గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా సాగుతున్నాయి బాబా వారికి పలు రకాల పుష్పాలతో విశేష అలంకరణ అష్టోత్తర పూజ మంగళ వాయిద్యాలతో పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. చిన్నారుల ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి ఉభయకర్తలుగా డాక్టర్ జనార్దన్ రెడ్డి రోహిణి కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

# పురిటిపాలెంలో మెగా పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమావేశం

## విద్యతో పేదరికానికి దూరం



గూడూరు (సింధూర దర్శిని) 24 నెల్లూరు జిల్లా ; గూడూరు రూరల్ మండలం పురిటి పాలెం రోటరీ నగర్లో ఏర్పాటైవున్న ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ ఆత్మీయ సమావేశంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు సురేష్ రెడ్డి, కార్యదర్శి నాగ సునీల్ కుమార్, పాల్గొని విద్యార్థులకు భోజన ప్లేట్లు, గ్లాసులతోపాటు, నోట్ బుక్స్ ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యతో పేదరికాన్ని దూరం చేయవచ్చునని, పేద విద్యార్థుల కోసం రోటరీ క్లబ్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని, పిల్లలందరూ చక్కగా చదువుకునే అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు రమణయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఐదేళ్లలో ఏపీ కోర్టుల అభివృద్ధికి రూ.104.29 కోట్లు విడుదల

## రాష్ట్రంలోని జిల్లా కోర్టుల్లో 137 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీ

## రాష్ట్రంలో జిల్లా కోర్టుల మౌలిక వసతులు, ఖాళీలపై పార్లమెంటులో ఎంపీ వేమిరెడ్డి

నెల్లూరు (సింధూర దర్శిని) 24 జూలై నెల్లూరు జిల్లా ; ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో ఉన్న మౌలిక వసతులు, నిర్మాణంలో ఉన్న భవనాలు, గత ఐదేళ్లలో కేటాయించిన నిధులు, న్యాయమూర్తుల ఖాళీలు, ఐదేళ్లకు పైగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల వివరాలపై నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పార్లమెంటులో లిఖితపూర్వకంగా కొన్ని ప్రశ్నలు అడిగారు.ఎంపీ వేమిరెడ్డి ప్రశ్నలకు కేంద్ర ఉపాధి, పార్లమెంటరీ వ్యవహారాలు, న్యాయ శాఖ సహాయ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ శుక్రవారం లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చారు. జిల్లా కోర్టుల అభివృద్ధి ప్రాథమికంగా రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోని అంశమైనప్పటికీ, కేంద్ర ప్రభుత్వం 'కేంద్ర రంగ పథకం ద్వారా కోర్టు హాళ్లు, జడ్జీల నివాస సముదాయాలు, లాయర్ల హాళ్లు, శౌచాలయాలు, డిజిటల్ కంప్యూటర్ గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తోందని కేంద్ర మంత్రి తెలిపారు. ఈ పథకం కింద 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌కు రూ.8.79 కోట్ల నిధులను మంజూరు చేసేందుకు అనుమతి ఇచ్చినట్లు తెలిపారు.



### నిధుల కేటాయింపు

గత ఐదేళ్లలో కేంద్ర పథకం కింద ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కోర్టుల మౌలిక వసతుల అభివృద్ధికి మొత్తం రూ. 104.29 కోట్ల నిధులను విడుదల చేసినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. ఇందులో సంవత్సరాల వారీగా పరిశీలిస్తే.. 2021-22లో ఎలాంటి నిధులు కేటాయించలేదు. 2022-23లో రూ.22.50 కోట్లు, 2023-24లో రూ.49.82 కోట్లు, 2024-25లో రూ.0.99 కోట్లు, 2025-26లో రూ.30.98 కోట్ల చొప్పున నిధులు విడుదల చేసినట్లు తెలిపారు.

### ఖాళీ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఇచ్చిన సమాచారం ప్రకారం (2026 మే 31 నాటికి) రాష్ట్రంలోని వివిధ జిల్లా కోర్టుల్లో మొత్తం 875 మంజూరైన పోస్టులకు గాను 137 న్యాయమూర్తుల పోస్టులు ఖాళీగా ఉన్నట్లు కేంద్ర మంత్రి తెలిపారు. జిల్లాల వారీగా.. అనంతపురంలో 63 పోస్టులకు గాను 15, చిత్తూరులో 80 పోస్టులకు గాను 24, తూర్పు గోదావరిలో 80కి గాను 12, గుంటూరులో 79కి గాను 4, కడపలో 49కి గాను 5, కృష్ణాలో 107కి గాను 13, కర్నూలులో 76కి గాను 19, నెల్లూరులో 49కి గాను 6, ప్రకాశంలో 50కి గాను 7, శ్రీకాకుళంలో 41కి గాను 8, విశాఖపట్నంలో 102కి గాను 10, విజయనగరంలో 32కి గాను 5, పశ్చిమ గోదావరిలో 67కి గాను 9 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వివరించారు.

### కోర్టు భవనాలు

ఇక కోర్టు భవనాల నిర్మాణాల విషయానికి వస్తే.. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 10 ప్రాజెక్టులు పూర్తి కావడమే కాకుండా అందుబాటులోకి వచ్చాయని, మరో 24 ప్రాజెక్టులు వివిధ దశలలో నిర్మాణంలో ఉన్నాయని కేంద్ర మంత్రి తెలిపారు. కాకినాడలో 2, అన్నమయ్య, తూర్పు గోదావరి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, కృష్ణా, ఎన్టీఆర్, విశాఖపట్నం, ప్రకాశం, శ్రీకాకుళం జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున కోర్టు ప్రాజెక్టుల నిర్మాణాలు పూర్తయ్యాయని పేర్కొన్నారు.

అదేవిధంగా వైఎస్సార్ కడప జిల్లాలో 4 ప్రాజెక్టులు, అనకాపల్లి, ఏలూరు, పార్వతీపురం, కాకినాడ జిల్లాల్లో రెండేసి ప్రాజెక్టులు, అన్నమయ్య, తూర్పు గోదావరి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ, తిరుపతి, విజయనగరం, కర్నూలు, నంద్యాల, పశ్చిమ గోదావరి, చిత్తూరు, ఎన్టీఆర్, విశాఖపట్నం, ప్రకాశం జిల్లాల్లో ఒక్కొక్కటి చొప్పున నిర్మాణాలు జరుగుతున్నట్లు తెలిపారు. ఐదేళ్లకు పైగా (2021 కంటే ముందు ప్రారంభమై) దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు రాష్ట్రంలో రెండే ఉన్నాయని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు. కోనసీమ జిల్లా రామచంద్రాపురంలో సీనియర్ సివిల్ జడ్జి నివాస సముదాయం, కర్నూలు జిల్లా ఆదోనిలో 6 కోర్టుల భవన సముదాయం నిర్మాణాలు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. 'న్యాయ వికాస్ పోర్టల్' అనే ఆన్‌లైన్ వ్యవస్థ ద్వారా ఈ ప్రాజెక్టుల ఆలస్యానికి గల కారణాలను, నిర్మాణ పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ తగిన చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర మంత్రి పార్లమెంటులో వివరించారు.

# రేబాలలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి

**ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు**

**అంబేడ్కర్ ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపు**

**ఏ సమస్య ఉన్నా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ**



బుచ్చిరెడ్డిపాలెం (సింధూర దర్శిని) 24 జూలై నెల్లూరు జిల్లా; బుచ్చిరెడ్డిపాళెం మండలం రేబాల గ్రామం తూర్పు హరిజనవాడలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాన్ని కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముందు గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శనం చేసుకున్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ.. అంబేద్కర్ విగ్రహాన్ని ప్రారంభించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఆయన చూపిన బాటలో నడవాలని, ముఖ్యంగా యువత అంబేద్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. పంచాయతీల్లోగానీ, కాలనీల్లోగానీ ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు స్థానిక నాయకుల దృష్టికి తీసుకెళ్లాలని, లేదంటే నేరుగా తననైనా సంప్రదించవచ్చని ఎమ్మెల్యే తెలిపారు. కాలనీలకు అవసరమైన అభివృద్ధి పనులను అడిగి చేయించుకునే హక్కు ప్రజలందరికీ ఉందన్నారు. పేదలకు సేవ చేయడానికే తాను రాజకీయాల్లోకి వచ్చానని, ఏ సమస్యను తన దృష్టికి తీసుకొచ్చినా వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రాబోతున్నాయని, ఈ నేపథ్యంలో ప్రజలందరూ ఐకమత్యంతో ఉండాలని సూచించారు. వర్గాలు, విభేదాలు పక్కన పెట్టి అందరూ కలిసి పనిచేసుకున్నప్పుడే ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు.

# సమన్వయకర్త ఎంపికలో ఎటువంటి బేధాభిప్రాయాలు లేవు

**నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి**

**రాంకుమార్ రెడ్డిని కలిసిన యద్దల నరేంద్ర రెడ్డి, బూదూరు గురవయ్య**



గూడూరు (సింధూర దర్శిని) 24 జూలై నెల్లూరు జిల్లా ; వెంకటగిరిలోని ఎన్ జే ఆర్ భవనం నందు వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ని గూడూరు నియోజకవర్గ వైసీపీ నాయకులు .యద్దల నరేంద్ర రెడ్డి మరియు గూడూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త బూదూరు గురవయ్య మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే అందజేశారు. ఈ సందర్భంగా గూడూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా నియమించేందుకు సహకరించిన .నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేసి ఆశీర్వాదం తీసుకోవడం జరిగింది.ఈ సందర్భంగా రామ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జగనన్న మాటే మాకు శిరోధార్యం అని నాకు నియోజకవర్గ సమన్వయకర్త ఎంపికలో ఎటువంటి కోపాలు బేధాభిప్రాయాలులేవు అని తెలిపారు.. 2029ఎన్నికల్లో గురవయ్యని గూడూరు నియోజకవర్గంలో గెలిపించడం కోసం నావంతు కృషి చేస్తాను స్పష్టంగా తెలియజేశారు. అలాగే గురవయ్య కూడ నియోజకవర్గంలో ఉన్న ప్రతి నాయకుడిని మరియు ప్రతి కార్యకర్తలని కలుపుకొని 2029 ఎన్నికల్లో నియోజకవర్గంలో పార్టీ జెండా ఎగరవేయాలని సూచించారు. నీకు అండగా రాష్ట్ర నాయకత్వం మరియు జిల్లా పార్టీ నాయకత్వం పాటు నియోజకవర్గ నాయకత్వం ఉంటుంది అని తెలిపారు.

# విద్యార్థి ప్రగతిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అత్యంత కీలకం

## జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్



తిరుపతి( సింధూర దర్శిని) 24 జూలై తిరుపతి జిల్లా ; విద్యార్థి ప్రగతిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అత్యంత కీలకమని, మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యక్రామాల నిర్వహణ ద్వారా విద్యా నాణ్యత మరింత మెరుగవుతుందని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక పండిట్ జవహర్ లాల్ నెహ్రూ మునిసిపల్ హైస్కూల్ నందు జరిగిన మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ 4.0 కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, క్లీన్ అండ్ గ్రీన్ బ్యుటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, తిరుపతి ఇంచార్జి మునిసిపల్ కమిషనర్ శారదా దేవి, డి.ఈ.ఓ. కె.వి.ఎన్ కుమార్ లతో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.... విద్యార్థి ప్రగతిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అత్యంత కీలకమని, మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ కార్యక్రామాల నిర్వహణ ద్వారా విద్యా నాణ్యత మరింత మెరుగవుతుందని తద్వారా విద్యార్థులు సమగ్రాభివృద్ధికి బలమైన పునాది అవుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో సమగ్ర సంస్కరణలు చేపట్టి విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు కృషి చేస్తోందన్నారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని నిరంతరం అంచనా వేసి, వ్యక్తిగతంగా పురోగతి సాధించేలా యాప్ ద్వారా పర్యవేక్షణ జరుగుతోందని తెలిపారు. ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ తో పాటు ప్రతి విద్యార్థి బలాలు, మెరుగుపరచాల్సిన అంశాలను గుర్తించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి పని చేయాల్సిన అవసరాన్ని వివరించారు. మెగా పేరెంట్--టీచర్ సమావేశాల ద్వారా తల్లిదండ్రులను విద్యార్థుల విద్యా ప్రయాణంలో భాగస్వాములుగా చేయడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 2,550 పాఠశాలల్లో సుమారు 1.52 లక్షల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి సమావేశంలో ఒక కొత్త అంశాన్ని ప్రవేశపెడుతున్నామని, ఈసారి డోనర్ యాప్ ద్వారా పూర్వ విద్యార్థులు, దాతలు పారదర్శకంగా పాఠశాల అభివృద్ధికి విరాళాలు అందించే విధానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చిందని వివరించారు. పాఠశాలలలో మౌలిక సదుపాయాల కల్పనకు "మన బడి - మన భవిష్యత్తు" కార్యక్రమం ద్వారా టాయిలెట్లు, తాగునీటి సౌకర్యాలు, అదనపు తరగతి గదులు తదితర అవసరాలను దశలవారీగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. అలాగే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు పోషకాహారం అందిస్తూ వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న రంగాల్లోనే ఎదగాలని, తల్లిదండ్రులు వారి అభిరుచులను గౌరవించి ప్రోత్సహించాలని ఇతరులతో పోల్చకుండా పిల్లల ప్రతిభను గుర్తించి సరైన మార్గనిర్దేశం చేస్తే వారు ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని పేర్కొన్నారు. మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ వంటి మహనీయుల జీవితాలను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, ప్రతి విద్యార్థి పెద్ద లక్ష్యాలు నిర్దేశించుకోవాలని పిలుపునిచ్చారు. దాతలు, పూర్వ విద్యార్థులు పారదర్శకంగా పాఠశాలల అభివృద్ధికి విరాళాలు అందించేందుకు డోనార్ యాప్ విధానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకుని రాగా డోనార్ యాప్ ద్వారా తన నెల జీతం లో అర్థ జీతం స్కూల్ నందు మౌలిక వసతుల అభివృద్ధి కొరకు జిల్లా కలెక్టర్ విరాళం అందించారు. తిరుపతి ఎం.ఎల్.ఎల్ రూ.50 వేలు, క్లీన్ అండ్ గ్రీన్ బ్యుటిఫికేషన్ చైర్మన్ రూ. 50 వేలు, డి.ఈ.ఓ. విద్యా శాఖ తరపున రూ. 20 వేలు విరాళాలను స్కూల్ నందు మౌలిక వసతులు అందజేశారు. వీరందరికీ జిల్లా కలెక్టర్ కృతజ్ఞతలు తెలుపుతూ మరింత మంది ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కొరకు ఈ డోనార్ యాప్ ద్వారా విరాళాలను అందిచుటకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు విద్యార్థుల విద్యా పురోగతిపై చర్చించారు. విద్యార్థుల ప్రతిభా ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రులకు క్రీడా పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. సమావేశం అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి మధ్యాహ్న భోజనంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# మాన్యువల్ స్కావెంజింగ్‌కు స్వస్తి పలుకుతాం






## పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ

## సఫాయి కార్మికులకు యంత్రాలే భరోసా

### రూ.2.10 కోట్ల రుణాలతో కొనుగోలు చేసిన ఆరు వాహనాలను ప్రారంభించిన మంత్రి

నెల్లూరు (సింధూర దర్శిని) 24 జూలై నెల్లూరు జిల్లా ; సఫాయి కార్మికుల ఆర్థిక స్వావలంబన, పరిశుభ్రత వ్యవస్థ ఆధునీకరణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. నెల్లూరు నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో జాతీయ సఫాయి ఖర్మచారి అభివృద్ధి కార్పొరేషన్ రుణాలతో కొనుగోలు చేసిన నాలుగు నాలా క్లీనింగ్ మిషన్లు, రెండు 12 టన్నుల ట్రిప్పర్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం నాలా క్లీనింగ్ ట్రాక్టర్‌ను స్వయంగా నడిపి కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో జాతీయ సఫాయి ఖర్మచారి అభివృద్ధి కార్పొరేషన్ ద్వారా 22 మంది లబ్ధిదారులకు రూ.2.10 కోట్ల సబ్సిడీ రుణాలు అందించామని చెప్పారు. ఆ రుణాలతో రూ.1.10 కోట్ల విలువైన నాలుగు నాలా క్లీనింగ్ యంత్రాలు, రూ.1 కోటి విలువైన రెండు ట్రిప్పర్లు కొనుగోలు చేయడం అభినందనీయమన్నారు. ఈ వాహనాలను నెల్లూరు కార్పొరేషన్ అద్దెకు తీసుకోవడం వల్ల లబ్ధిదారులకు ప్రతి నెలా స్థిరమైన ఆదాయం లభిస్తుందని, ఇది సంక్షేమంతో పాటు శాశ్వత ఉపాధికి దోహదపడే కార్యక్రమమని పేర్కొన్నారు. సఫాయి కార్మికులు నగర ఆరోగ్యాన్ని కాపాడే పరిశుభ్రత యోధులని కొనియాడిన మంత్రి, గతంలో చేతులతో చేసిన పనులను ఇప్పుడు యంత్రాల ద్వారా నిర్వహించడం వల్ల వారి భద్రత, ఆరోగ్యం, గౌరవం పెరుగుతాయని అన్నారు. మాన్యువల్ స్కావెంజింగ్ పూర్తిగా అంతమై సాంకేతికత ఆధారిత పరిశుభ్రత వ్యవస్థ అమలు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెత్త సేకరణ కోసం రాష్ట్రవ్యాప్తంగా రెండు వేల ఎలక్ట్రిక్ ఆటోలను మంజూరు చేశారని, వాటిలో కొన్ని ఇప్పటికే ప్రారంభించామని తెలిపారు. స్వచ్ఛాంధ్ర కోసం కేంద్రం మంజూరు చేసిన రూ.3 వేల కోట్ల నిధులను గత ప్రభుత్వం వినియోగించలేదని విమర్శించారు. పరిశుభ్రమైన నెల్లూరు నిర్మాణంలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం మంత్రి బీవీఎస్ పాఠశాలలో జరుగుతున్న ఆధునీకరణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నగరంలోని 8, 9 డివిజన్లలో రోడ్లు, కాలువల నిర్మాణ పనులను తనిఖీ చేసి నాణ్యతపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. పర్యటనలో ప్రజలతో మమేకమవుతూ ముందుకు సాగిన మంత్రి, ప్రోటోకాల్‌ను పక్కనపెట్టి స్థానిక బజ్జీల బండి వద్ద సామాన్యుడిలా బజ్జీలు తిని అందరినీ ఆకట్టుకున్నారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ నగరాభివృద్ధి, పేదల సంక్షేమానికి మంత్రి నారాయణ నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థుల కోసం రూ.6 కోట్లతో 10 వేల సైకిళ్లు కొనుగోలు చేశారని, తొలి విడతగా ఈ నెల 27న 7 వేల సైకిళ్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ దేవరకొండ సుజాత, అసిస్టెంట్ కమిషనర్ రేష్మా, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, మాజీ జెడ్పీటీసీ విజేతా రెడ్డి, నగర టీడీపీ అధ్యక్షుడు మామిడాల మధు, కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, టీడీపీ నాయకులు కిన్నెర సాగర్, బాలాజీ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# దేశ సాంఘిక, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి మూలం విద్య

## డాక్టర్ గ్లోరి యానెట్ సొపాటి, బాపట్ల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి

బాపట్ల, సింధూరదర్శిని:శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ ఆదేశాలతో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాన్ని (మెగా పీటీఎం 4.0) ఈ రోజు సంగుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల యందు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ గ్లోరి మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడంతోపాటు సమగ్ర అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో తల్లిదండ్రులు,



ఉపాధ్యాయుల మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని తెలిపారు. విద్య ద్వారా సామాజికసాంఘిక ఆర్థిక సాంస్కృతిక రాజకీయ అభివృద్ధి తో పాటు శాస్త్ర, సాంకేతిక పరిశోధన రంగాలలో అభివృద్ధికి సాధ్యపడుతుందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మికుమారి, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మినీ గురుకులంలో మెగా పిటిఎం

## ముఖ్య అతిథిగా మయూరి శ్యామ్ యాదవ్



గూడూరు( సింధూర దర్శిని) 24 జూలై నెల్లూరు జిల్లా ;. మినీ గురుకుల బాలికల పాఠశాల నందు మెగా పి.టి.యమ్. కార్యక్రమం చాలా ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ కృష్ణ సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ మయూరి శ్యామ్ యాదవ్ పాల్గొని, తల్లి తండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ మీరు మీ పిల్లలను ఇష్టపడి చదివించినప్పుడే వాళ్ళు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి వచ్చి సమాజంలో గౌరవం మైన జీవితం లభిస్తుందని అన్నారు. ఇదేవిధంగా తల్లిదండ్రులుగా మీకు కూడా సమాజంలో గౌరవం వారి ద్వారానే లభిస్తుందని తెలిపారు. హెడ్మాస్టర్ కె వి రజని కుమారి మాట్లాడుతూ తల్లిదండ్రులు బాల్య వివాహాల జరిపితే కలిగే నష్టాలను గురించి గంజాయి మరియు మత్తు పదార్థాలు వాడితే కలిగే అనర్థాలు గురించి ప్రసంగించి ఆ తదుపరి అందరి చేత ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఆ తదుపరి మయూరి శ్యామ్ యాదవ్ దాతృత్వంతో ప్రతి నెల క్రమం తప్పకుండా జరిగే సామూహిక జన్మదినాలను జూలై నెలలో జన్మించిన 10 మంది విద్యార్థునులతో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తలిదండ్రులకు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, మయూరి శ్యామ్ యాదవ్ చేతుల మీదుగా భహుమతులు అందించడం జరిగింది. హెడ్ మాస్టర్ కె వి . రజని కుమారి ఈ కార్యక్రమాన్ని ఎంతో ఆడంబరంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లలిత, పద్మావతి, రాజేశ్వరమ్మ, చంద్ర, అంకమ్మ, కల్పన, నాగూరమ్మ, లావణ్య, రమణమ్మ, తల్లిదండ్రులు మరియు విద్యార్థునులు పాల్గొని జయప్రదం చేయడం జరిగింది.

# గూడూరులో బంద్ విజయవంతం

## ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు స్వచ్ఛందంగా మూసివేత



గూడూరు( సింధూర దర్శిని) 24 నెల్లూరు జిల్లా ; డిల్లీ లో విద్యార్థులు , యువత పై జరిగిన దాడిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్త బంద్ లో భాగంగా శుక్రవారం గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ నందు ఏ. ఐ.ఎస్. ఎఫ్, పి.డి.ఎస్. యు , యు.ఎస్.ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఏ.ఐ.ఎస్.ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి యశ్వంత్, రిజ్వాన్ లు మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ తో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్ గందరగోళంగా మారిందన్నారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీ కి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా శాంతియుతంగా విద్యార్థులు , యువత పై దాడి చేసిన వారి పై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జి.శశి కుమార్ , పట్టణ కన్వీనర్ వై. సునీల్ మాట్లాడుతూ శాంతియుతంగా ధర్నా చేస్తున్న విద్యార్థుల పై కేంద్ర ప్రభుత్వం దాడి చేయడం ఎంత వరకు సమంజసం అని పేర్కొన్నారు. అదేవిధంగా నీట్ పేపర్ లీకేజీ కారకులను కటినంగా శిక్షించాలని పేర్కొన్నారు. దేశంలో విద్యార్థులు , యువత భవిష్యత్ అధంకారంలో ఉందన్నారు. విద్యార్థులు ,యువత పై దాడి చేసిన వారిని కటినంగా శిక్షించాలన్నారు. నీట్ పేపర్ లీకేజీ బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీ నామ చేయాలన్నారు. అనంతరం విద్యాసంస్థల బంద్ సందర్భంగా పలు పాఠశాలలు, కళాశాలలు స్వచ్ఛందంగా మూసి వేశారు. ఈ బంద్‌కు సీపీఐ, ఏ. ఐ.టి. యు.సి , సంపూర్ణ మద్దతు తెలిపారు .ఈ కార్యక్రమంలో ,సీపీఐ నియోజక వర్గ సహాయ కార్యదర్శి జమాలుల్లా, ఏ.ఐ.టి. యు.సి నియోజకవర్గ కార్యదర్శి సి.వి.ఆర్ కుమార్ , ఏ. ఐ.టి. యు. సి జిల్లా అధ్యక్షులు నారాయణ , పి.డి. ఎస్ . యు జిల్లా నాయకులు సునీల్,యు.ఎస్.ఎఫ్ నాయకులు ఉద్దాల మణి, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ప్రారంభమైన మాతమ్మ తల్లి జాతర

## అమ్మవారి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు

## ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



కోవూరు (సింధూర దర్శిని) 24 జూలై నెల్లూరు జిల్లా; కోవూరు నియోజకవర్గం, బుచ్చిరెడ్డిపాళెం రూరల్ మండలం పెనుబల్లి అరుంధతి వాడలో ఐదేళ్ల తర్వాత జరుగుతున్న మాతమ్మ తల్లి జాతరలో కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పాల్గొన్నారు. శుక్రవారం పుట్టమట్టి తెచ్చే కార్యక్రమంతో జాతర ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్థానిక గ్రామ ప్రజలు, భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొని, మాతమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాతమ్మ ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, అందరికీ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు ప్రసాదించాలని ప్రార్థించారు.

# ఆధ్యాత్మికతకు ఆరంభ ద్వారం ... మోక్ష మార్గానికి మొదటి అడుగు నేడు తొలి ఏకాదశి



మోక్ష మార్గానికి మొదటి అడుగు శ్రీ మహా విష్ణువు మహాత్యంలో ప్రారంభమయ్యే శుభదినం హరివాసరానికి ఆధ్యాత్మిక మహిమగా ఉండే తొలి ఏకాదశి పండుగ నేడు జరుపుకుంటున్నాం హిందూ సంప్రదాయంలో ఏకాదశి తిధులకు అత్యంత ప్రాముఖ్యత ఉంది వాటిలో ఆషాడ శుక్ల ఏకాదశిని తొలి ఏకాదశి లేదా శయన ఏకాదశి దేవ శయన ఏకాదశి అని పిలుస్తారు చాతుర్మాయస్య ప్రారంభానికి సూచికగా భావించే ఈ పవిత్రమైన రోజున శ్రీ మహా విష్ణువు ఆదిశేషుని పై యోగ నిద్రలోకి ప్రవేశిస్తాడని పురాణాలు చెబుతున్నాయి అందువల్ల ఈరోజు శ్రీ మహా విష్ణువును అత్యంత భక్తిశ్రద్ధలతో ఆరాధించడం విశేష ఫలితాలను ఇస్తుందని భక్తుల విశ్వాసం నాలుగు నెలలు అనంతరం వచ్చే ప్రబోధిని (ఉత్థాన ) ఏకాదశి రోజున యోగ నిద్ర నుండి శ్రీ మహా విష్ణువు మేల్కొంటాడని విశ్వసిస్తారు ఈ నాలుగు నెలలును చాతుర్మాస్యం అని పిలుస్తారు తొలి ఏకాదశి రోజున ఉపవాస దీక్ష ఆచరించి విష్ణు సహస్రనామ పారాయణం భగవద్గీత పఠనం హరి నామ సంకీర్తనలు చేయడం ద్వారా పాపాలు తొలగి మనశ్శాంతి ఆయురారోగ్యాలు ఐశ్వర్యశీ ఆధ్యాత్మిక పురోగతి కలుగుతాయని శాస్త్రాలు పేర్కొంటాయి ఈ రోజున ఆలయాల్లో ప్రత్యేక పూజలు అభిషేకాలు అర్చనలు మహా మంగళహారతులు నిర్వహిస్తారు ఈ పవిత్రమైన తొలి ఏకాదశి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలను సందర్శించి స్వామి వారిని దర్శనం చేసుకుంటారు భక్తి నియమం ఉపవాసం సేవా భావం కలగలిపిన తొలి ఏకాదశి ప్రతి హిందువు ఆధ్యాత్మిక జీవితంలో విశిష్ట స్థానాన్ని కలిగి ఉంది ఈ పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో ఆచరించడం ద్వారా శ్రీ మహావిష్ణువు కటాక్షం లభిస్తుందని భక్తుల విశ్వాసం



**పేలాల పిండి విశిష్టత**

తొలి ఏకాదశి రోజున భక్తులు శ్రీ మహావిష్ణువునకు అత్యంత భక్తిశ్రద్ధలతో పేలాలను పొడిచేసి తయారు చేసిన నైవేద్యం సమర్పించడం అనాదిగా వస్తున్న ఆచారం ఉపవాస దీక్షలో భాగంగా సులభంగా జీర్ణమయ్యే పవిత్రమైన ఆహారంగా పేలాల పిండికి ప్రత్యేక స్థానం ఉంది పేలాలు ధాన్యాన్ని అగ్నితో శుద్ధి చేసి తయారు చేస్తారు అందువల్ల అవి పవిత్రతకు సాత్వికతకు ప్రతీకగా భావిస్తారు పేలాల పిండిని బెల్లం నెయ్యి లేదా పంచదారతో కలిపి నైవేద్యంగా సమర్పించి ప్రసాదంగా స్వీకరిస్తారు ఇది శరీరానికి తేడికైనా ఆహారం మాత్రమే కాకుండా ఉపవాసం చేసే భక్తులకు తక్షణ శక్తిని అందించే పోషకాహారంగా కూడా ఉపయోగపడుతుంది

**పండుగల పరంపర ప్రారంభం**

తొలి ఏకాదశి అనంతరం పండుగల పరంపర క్రమంగా ప్రారంభమవుతుంది వరలక్ష్మీ వ్రతం శ్రీకృష్ణ జన్మాష్టమి వినాయక చవితి మహాలయ అమావాస్య శరన్నవరాత్రులు విజయదశమి దీపావళి కార్తీకమాస పూజలు వంటి ప్రధాన పర్వదినాలు ఇకనుండి వరుసగా వస్తాయి అందుకే తొలి ఏకాదశి ఆధ్యాత్మిక సాధనకు నాంది పలికే పవిత్ర పర్వదినంగా అలాగే సంవత్సరంలోని పండుగల పరంపరకు ఆరంభ సూచికగా హిందూ సంప్రదాయంలో విశిష్ట స్థానాన్ని సంపాదించింది

## విద్యార్థుల చదువు గురించి తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలి

పెదకూరపాడు, సింధూరదర్శిని: విద్యార్థుల చదువు గురించి తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు.మండల పరిధిలోని 75త్యాళ్ళూరు పిఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ 4.0 విజయవంతంగా జరిగింది.ఉపాధ్యాయులు విద్యార్థుల హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు తల్లిదండ్రులకు అందజేసి వివిధ రంగాలలో వారి ప్రగతిని వివరించారు.దేశ అభివృద్ధిలో విద్య కీలకమైన పాత్ర పోషిస్తుందని,నాణ్యమైన మరియు గుణాత్మకమైన విద్యను ప్రభుత్వ పాఠశాలలు అందిస్తున్నాయని వక్తలు అన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎ.శ్రీనివాసరెడ్డి పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధిని,వివిధ అంశాలను వివరించారు.హిందీ టీచర్ టి.మాధవి పాఠశాల ప్రగతి నివేదికను వివరించారు. ఈ సమావేశంలో తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు బి. జయరామి రెడ్డి, జె.రామిరెడ్డి మాట్లాడారు.వివిధ రంగాలలో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు.పాఠశాలలో ఏర్పాటుచేసిన ఎగ్జిబిట్స్, ముఖ్యంగా డాన్సింగ్ రోబో తల్లిదండ్రులను విశేషంగా ఆకర్షించింది.తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించిన తర్వాత తల్లిదండ్రులకు మ్యూజికల్ చైర్స్,టగ్ ఆఫ్ వార్ పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం తర్వాత ఈ కార్యక్రమం ముగిసింది.పాఠశాలను తరగతి గదులను సుందరీకరణ చేసి ఈ మీటింగ్ ను పండగ వాతావరణంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ కె.శరత్ బాబు,డాక్టర్ వెలుగొండా రెడ్డి,ఎస్ఎంసి చైర్మన్ జీవి.హనుమంత రావు, కమిటీ మెంబర్లు, హెచ్.ఎం ఎ.శ్రీనివాసరెడ్డి, సిఆర్పీ వి.శివ,పెద్ద సంఖ్యలో తల్లి తండ్రులు, పూర్వవిద్యార్థులు, దాతలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలంటే చదువుతోనే సాధ్యం

### అగ్నిగుండాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు బలుసుపాటి సత్యనారాయణ

అమరావతి సింధూరదర్శిని: విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలంటే చదువు తోనే సాధ్యం అని అగ్నిగుండాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు బలుసుపాటి సత్యనారాయణ అన్నారు. గురువారం కొచ్చర్ల గ్రామం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి పరీక్షలలో ద్వితీయ స్థానంలో ఉత్తీర్ణత సాధించిన మాధురికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అగ్నిగుండాల లో పని చేస్తున్న పి.యస్ (హెచ్.యం) బలుసుపాటి సత్యనారాయణ 1000 రూపాయలు నగదు అందజేశారు.ఈ సందర్భంగా నగదును అగ్నిగుండాల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేళావతు శివా నాయక్ బుధవారం ఆమెకు అందజేశారు.అప్గ్రేడ్లో భాగంగా అగ్నిగుండాల ఉన్నత పాఠశాల విద్యార్థులు 2027 మొదటిసారిగా పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. పాఠశాల స్థాయిలో ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించనున్న విద్యార్థులకు రూ.2000,రూ.1000,రూ.500 నగదును ఇవ్వనున్నట్లు ప్రకటించారు.ఫలితాలు విడుదలైన వెంటనే నగదును విద్యార్థులకు అందించనున్నట్లు ఉన్నత పాఠశాల హెచ్.యంకు సత్యనారాయణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బయాలజీ ఉపాధ్యాయులు సుభాని, విద్యార్థులు పాల్గొన్నారు.

## గోర్తి ఈశ్వర ట్రస్ట్ సేవలు అభినందనీయం

మాచర్ల,సింధూరదర్శిని:గోర్తి ఈశ్వర ట్రస్ట్ సేవలు అభినందనీయమని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత హైస్కూల్లో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గత ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి బి లత శ్రీ స్కూల్ టాపర్గా నిలిచింది. ఈ సందర్భంగాగోర్తి ఈశ్వర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు ఉషాబాల పవన్ కుమార్ సహకారంతో రూ 25 వేల రూపాయల చెక్కును ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి విద్యార్థి లత శ్రీ కి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహిస్తున్నగోర్తి ఈశ్వర్ ట్రస్ట్ నిర్వాహకులను అభినందించారు.





## శ్రీ కామాక్షితాయి అమ్మవారికి ఆషాడ మాస సారే సమర్పణ

### ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

బుచ్చిరెడ్డిపాలెం (సింధూర దర్శిని) 24 జూలై నెల్లూరు జిల్లా; బుచ్చిరెడ్డిపాలెం మండలం, జొన్నవాడ క్షేత్రంలోని శ్రీ మల్లికార్జున స్వామి - శ్రీ కామాక్షితాయి దేవస్థానంలో కోవూరు శాసనసభ్యులు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి, అనంతరం శాకాంబరీ అలంకారంలో కొలువుదీరిన శ్రీ కామాక్షి తాయి అమ్మవారిని దర్శించి ఆషాఢ మాస సారెను సమర్పించి ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా దేవస్థానంలో ఏర్పాటు చేసిన 40 కిలోవాట్ల సోలార్ పవర్ ప్లాంట్ మరియు పునరుద్ధరించిన దేవస్థాన పరిపాలనా కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. 40 కిలోవాట్ల సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు నెల్లూరు నందిని రైస్ & బాయిల్డ్ రైస్ మిల్లు యాజ మాన్యులు చలువాది మల్లికార్జున రావు వారి ధర్మపత్ని లక్ష్మి శివ కుమారి , అలాగే మారేపల్లి చంద్రశేఖర్ రెడ్డి , వారి ధర్మపత్ని మనోరమా రెడ్డి ఉదారంగా విరాళాలు అందించగా, మిగిలిన వ్యయాన్ని దేవస్థాన నిధులతో సమకూర్చి ఈ ప్రాజెక్టును పూర్తి చేశారు. ఈ సందర్భంగా దేవస్థాన అభివృద్ధికి సహకరించిన దాతలను ఎమ్మెల్యే అభినందించి, వారి సేవా భావాన్ని కొనియాడారు. అనంతరం ఆషాఢ మాసాన్ని పురస్క రించుకొని వివిధ రకాల కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, ధాన్యాలతో అత్యంత వైభవంగా అలంకరించిన శాకాంబరీ స్వరూపిణి శ్రీ కామాక్షితాయి అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ఆషాఢ మాస సారెను సమర్పించి రాష్ట్ర ప్రజలు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, సకాలంలో వర్షాలు కురిసి దేశం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. శాకాంబరీ అలంకారానికి మలెం మధుసూదన రెడ్డి, ఉష కూరగాయలను, బిజవేముల భాస్కర్ రెడ్డి , వసుధ పండ్లను సమర్పించి అమ్మవారి సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మరియు దేవస్థాన అధికారులు దాతలను అభినందించి, వారి సేవా స్ఫూర్తిని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణకు దోహదపడే సోలార్ విద్యుత్ వ్యవస్థల ఏర్పాటు దేవస్థానాలకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. భక్తులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు, దేవస్థాన అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.దేవస్థాన అధికారులు ఎమ్మెల్యే ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి, శ్రీ మల్లికార్జున స్వామి, శ్రీ కామాక్షితాయి అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల వేదాశీర్వచనాల అనంతరం తీర్థప్రసాదాలు, శేషవస్త్రంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ తిరుమూరు అశోక్ రెడ్డి , దేవస్థాన సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులు రెడ్డి మరియు ధర్మకర్త మండలి సభ్యులు నక్కల శివ కృష్ణ , జొన్నలగడ్డ వరలక్ష్మి, శ్రీ కీలుకుప్ప శ్రీనివాసులు , సూరాయపాలెం ప్రత్యూష , రామాయణం సుధారాణి , ముంగర సుధాకర్ , శ్రీవారి సేవాసమితి బృందం, కోలాట బృందం, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలతో ప్రజలకు సులభతర సేవలు

### పల్నాడు జిల్లా రిజిస్ట్రార్ ఎస్. రామ్ కుమార్



నరసరావుపేట, సింధూరదర్శిని: పాస్పోర్ట్ సేవా కేంద్రాల తరహాలోనే జిల్లాలోని ప్రజలందరికీ అత్యంత వేగవంతమైన, పారదర్శకమైన మరియు సులభతరమైన సేవలందించేందుకు ప్రభుత్వం ప్రతి జిల్లా హెడ్క్వార్టర్లో ప్రత్యేకంగా 'రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను' అందుబాటులోకి తీసుకువస్తోందని పల్నాడు జిల్లా రిజిస్ట్రార్ ఎస్. రామ్ కుమార్ వెల్లడించారు. ప్రభుత్వానికి ఆదాయం పెంచడంతో పాటు రిజిస్ట్రేషన్కు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలనే ముఖ్య ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ సేవా కేంద్రాలలో విజిటర్స్ కోసం ప్రత్యేక రిసెప్షన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ కౌంటర్లు, విశాలమైన ఎయిర్ కండిషన్డ్ (గూ/జ) వెయిటింగ్ హాల్, సురక్షితమైన తాగునీరు మరియు అత్యుత్తమ మౌలిక వసతులు అందుబాటులో ఉంటాయి. డాక్యుమెంట్ ప్రిపరేషన్, ఆన్లైన్ స్లాట్ బుకింగ్, స్టాంప్ డ్యూటీ చెల్లింపు వంటి ప్రక్రియలన్నీ ఒకే చోట పూర్తి చేసుకునే వెసులుబాటు కల్పిస్తున్నారు. కేంద్రంలోనే సబ్-రిజిస్ట్రార్ మరియు ఆ శాఖ సిబ్బంది అందుబాటులో ఉండి పత్రాలను వెంటనే చట్టబద్ధంగా పరిశీలిస్తారు. అన్నీ సరిగ్గా ఉన్న డాక్యుమెంట్లను కేవలం 1 నుండి 2 గంటల వ్యవధిలోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి, ఒరిజినల్ పత్రాలను యజమానులకు అందజేస్తారు. ఇదే సమయంలో ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్ల ఉపాధిపై వస్తున్న అపోహలను జిల్లా రిజిస్ట్రార్ ఖండించారు. ఈ సేవా కేంద్రాల వల్ల ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్లు ఉపాధి కోల్పోతారనే ప్రచారంలో ఎలాంటి నిజం లేదని తెలిపారు. ప్రజలు నేరుగా సేవా కేంద్రానికే రావచ్చునని తెలిపారు.పల్నాడు జిల్లా వ్యాప్తంగా మొత్తం 10 సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయని, రోజూ ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 6:00 గంటల వరకు అధికారులు, సిబ్బంది సేవలందిస్తారని వెల్లడించారు. డాక్యుమెంట్లు పెండింగ్లో పడతాయనే అనవసరపు అపోహలను పక్కనబెట్టి కొనుగోలుదారులు, అమ్మకందారులు నేరుగా కార్యాలయాలకు రావచ్చని కోరారు. డాక్యుమెంట్ ప్రిపరేషన్ లేదా ఇతర సేవలలో ఎలాంటి సమస్యలు ఎదురైనా నేరుగా అధికారులను లేదా జిల్లా రిజిస్ట్రార్ను సంప్రదిస్తే, దగ్గరుండి ప్రక్రియ పూర్తి చేయించి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈకార్యక్రమంలో నరసరావుపేట జాయింట్ సబ్ రిజిస్ట్రార్ 1ఎం.వి.సుబ్బారావు, జాయింట్ సబ్ రిజిస్ట్రార్ 2.పి.వి. నాగేశ్వరావు పాల్గొన్నారు



## భారత్‌పై పాక్ డిజిటల్ కుట్ర..

**400 ఖాతాలపై ఢిల్లీ పోలీసుల హెచ్చరిక**
**భారత్‌ను లక్ష్యంగా చేసుకుని**
**పాకిస్థాన్ సోషల్ మీడియాలో దుష్ప్రచారం**
**400కు పైగా పాకిస్థానీ ఖాతాలను గుర్తించినట్లు**
**వెల్లడించిన ఢిల్లీ పోలీసులు**
**ఏదైనా పోస్ట్ షేర్ చేసే ముందు వాస్తవాలు**
**సరిచూసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి**
**నిరాధారమైన కంటెంట్ షేర్ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక**

దేశంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులను ఆసరాగా చేసుకుని, సోషల్ మీడియా వేదికగా పాకిస్థాన్ భారీ దుష్ప్రచారానికి తెరలేపిందని ఢిల్లీ పోలీసులు హెచ్చరించారు. ప్రజల్లో అశాంతిని రేకెత్తించేలా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేస్తున్న 400కు పైగా పాకిస్థానీ సోషల్ మీడియా ఖాతాలను గుర్తించినట్లు ఓ సీనియర్ పోలీసు అధికారి వీడియో సందేశం ద్వారా వెల్లడించారు. ఇంటెలిజెన్స్ బృందాల నిఘాలో ఈ అంశం వెలుగులోకి వచ్చిందని ఆయన తెలిపారు. ఈ ఖాతాల ద్వారా తప్పుడు కథనాలు, మార్ఫింగ్ చేసిన వీడియోలు, నిరాధారమైన సమాచారాన్ని వ్యాప్తి చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని వివరించారు. గతంలో 'ఆపరేషన్ సిందూర్' సమయంలో క్రియాశీలంగా ఉన్న పలు ఖాతాలు ప్రస్తుతం మళ్లీ యాక్టివ్ అయినట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో, గుర్తించిన ఖాతాలను బ్లాక్ చేస్తున్నామని, సైబర్ సెల్ బృందాలు నిరంతరం (24/7) నిఘా ఉంచాయని సదరు అధికారి తెలిపారు. కేంద్ర ఏజెన్సీలతో సమన్వయం చేసుకుంటూ ఈ వ్యవహారంపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు పోలీసులు పలు కీలక సూచనలు జారీ చేశారు. ఏదైనా పోస్ట్ లేదా వీడియోను షేర్ చేసే ముందు వాటి వాస్తవికతను సరిచూసుకోవాలని కోరారు. పుకార్లను వ్యాప్తి చేయవద్దని, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. నిరాధారమైన అంశాలను షేర్ చేయడం ద్వారా దేశ వ్యతిరేక శక్తులకు పరోక్షంగా సహకరించినట్లవుతుందని, అలాంటి వారిపై సైబర్ చట్టాల కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## రజత్ పటీదార్‌కు అన్యాయం జరిగిందా?

### సెలక్టర్ల తీరుపై హనుమ విహారి అసంతృప్తి!

**రజత్ పటీదార్‌ను ఎంపిక చేయకపోవడంపై**
**హనుమ విహారి ఆగ్రహం**
**కుల్‌దీప్ యాదవ్, సంజూ శాంసన్‌లకు చోటు**
**దక్కకపోవడంపై ప్రశ్నలు**
**జట్టులో ఎడమచేతి వాటం బ్యాటర్లే ఎక్కువగా ఉన్నారని కామెంట్**





జింబాబ్వేతో జరుగుతున్న టీ20 సిరీస్‌ను భారత్ ఘనవిజయంతో ప్రారంభించినప్పటికీ.. మ్యాచ్ వెనుక జట్టు ఎంపికపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది! ఆర్‌సీబీ కెప్టెన్‌గా రాణించిన రజత్ పటీదార్‌ను పక్కనబెట్టడం పట్ల టీమ్ ఇండియా మాజీ బ్యాటర్ హనుమ విహారి విమర్శలు గుప్పించాడు. హరారే వేదికగా గురువారం జరిగిన తొలి టీ20లో జింబాబ్వేను 125/7 పరుగులకే నిరోధించిన భారత్, 13.2 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించింది. 15 ఏళ్ల సంచలనం వైభవ్ సూర్యవంశీ కేవలం 18 బంతుల్లోనే ధనాధన్ అర్ధశతకం సాధించి అంతర్జాతీయ టీ20ల్లో అతి చిన్న వయసులో హాఫ్ సెంచరీ చేసిన ప్లేయర్‌గా చరిత్ర సృష్టించాడు. బౌలింగ్‌లో మయాంక్ యాదవ్ (2/18), ప్రిన్స్ యాదవ్ (2/19) నిప్పులు చెరిగారు. అయితే, ఈ గ్రాండ్ విక్టరీ తర్వాత కూడా సెలక్టర్ల నిర్ణయాలపై విహారి తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా ప్రశ్నల వర్షం కురిపించారు. ఐపీఎల్ 2026లో ఆర్‌సీబీని ముందుండి నడిపించడమే కాకుండా 196.76 స్ట్రైక్ రేట్‌తో 486 పరుగులు చేసిన పటీదార్‌ను ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదని విహారి ప్రశ్నించారు. "జట్టు నిండా ఎడమచేతి వాటం బ్యాటర్లతోనే నింపేశారు. శ్రేయస్ అయ్యర్ మినహా సరైన కుడిచేతి వాటం బ్యాటరే లేరు. పటీదార్ లేదా సంజూ శాంసన్ వంటి కుడిచేతి వాటం ఆటగాళ్లు ఉంటే జట్టు బ్యాలెన్స్‌డ్ గా ఉండేది. వయసును మాత్రమే కొలమానంగా తీసుకుని అనుభవాన్ని, ప్రదర్శనను పక్కనబెట్టడం సరికాదు" అని ఆయన అభిప్రాయపడ్డాడు. అలాగే స్టార్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్‌ను తప్పించడంపై కూడా విహారి ఆశ్చర్యం వ్యక్తం చేశాడు.

# సచిన్ 37 ఏళ్ల రికార్డు బద్దలు..

## 15 ఏళ్లకే ప్రపంచ రికార్డులు సృష్టించిన వైభవ్ సూర్యవంశీ!

జింబాబ్వేతో తొలి టీ20లో 18 బంతుల్లోనే విధ్వంసక హాఫ్ సెంచరీ – అతి పిన్న వయసులో అర్ధశతకం బాదిన ఆటగాడిగా ప్రపంచ రికార్డు

క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ 37 ఏళ్ల నాటి రికార్డు బద్దలు – ఒకే ఇన్నింగ్స్‌తో పలు ప్రపంచ రికార్డులను తిరగరాసిన యువ కెరటం

భారత క్రికెట్‌లో యువ కెరటం వైభవ్ సూర్యవంశీ సంచలనాలు సృష్టిస్తున్నాడు. కేవలం 15 ఏళ్ల 118 రోజుల వయసులోనే అంతర్జాతీయ అరంగేట్రం చేసిన వైభవ్, తన నాలుగో మ్యాచ్‌లోనే ప్రపంచ రికార్డుల మోత మోగించాడు. జింబాబ్వేతో హరారే వేదికగా జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగి, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ పేరిట ఉన్న 37 ఏళ్ల నాటి రికార్డును బద్దలుకొట్టాడు. ఈ మ్యాచ్‌లో కేవలం 18 బంతుల్లోనే 4 ఫోర్లు, 4 సిక్సర్లతో అర్ధశతకం పూర్తి చేసి చరిత్ర సృష్టించాడు. ఇంగ్లండ్‌తో ఆడిన తొలి మూడు ఇన్నింగ్స్‌లలో 14, 13, 15 పరుగులతో నిరాశపరిచిన సూర్యవంశీ, జింబాబ్వేపై తన అసలైన ఆటను ప్రదర్శించాడు. ప్రత్యర్థి బౌలర్లు వేసిన పేలవమైన బంతులను చక్కగా వాడుకుంటూ బౌండరీల వర్షం కురిపించాడు. ఈ క్రమంలో 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్కును అందుకున్నాడు. అయితే, ఆ తర్వాతి బంతికే పెవిలియన్ చేరాడు. కానీ అప్పటికే, తన పేరును ప్రపంచ రికార్డుల పుస్తకాల్లో సువర్ణాక్షరాలతో లిఖించుకున్నాడు.



**సూర్యవంశీ సృష్టించిన ప్రపంచ రికార్డులు**

ఈ ఇన్నింగ్స్‌తో సూర్యవంశీ పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో అతి పిన్న వయసులో (15 ఏళ్ల 118 రోజులు) హాఫ్ సెంచరీ చేసిన ఆటగాడిగా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఇంతకుముందు ఈ రికార్డు జిబ్రాల్టర్‌కు చెందిన లూయిస్ బ్రూస్ (16 ఏళ్ల 56 రోజులు) పేరిట ఉండేది. క్రిక్‌బజ్ సమాచారం ప్రకారం.. పూర్తిస్థాయి సభ్య దేశాల ఆటగాళ్లలో ఈ రికార్డు గతంలో ఆఫ్ఘనిస్థాన్ బ్యాటర్ రహ్మానుల్లా గుర్బాజ్ (17 ఏళ్ల 296 రోజులు) పేరిట ఉంది. అంతేకాకుండా అంతర్జాతీయ క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్లలో (టెస్టు, వన్డే, టీ20) కలిపి పూర్తిస్థాయి సభ్య దేశాల తరఫున అతి పిన్న వయసులో తొలి అర్ధశతకం నమోదు చేసిన ఆటగాడిగా సూర్యవంశీ నిలిచాడు. ఈ క్రమంలో 1989లో పాకిస్థాన్‌పై సచిన్ టెండూల్కర్ 16 ఏళ్ల 213 రోజుల వయసులో నెలకొల్పిన రికార్డును సూర్యవంశీ బద్దలుకొట్టాడు. ఈ జాబితాలో షాహిద్ అఫ్రిది (16 ఏళ్ల 214 రోజులు), ముస్తాక్ మహ్మద్ (17 ఏళ్ల 39 రోజులు) వంటి దిగ్గజాలు ఉన్నారు.

అసోసియేట్ దేశాలను కూడా పరిగణనలోకి తీసుకుంటే, పురుషుల అంతర్జాతీయ క్రికెట్‌లో 50ం స్కోరు చేసిన అత్యంత పిన్న వయస్కుడిగా కూడా సూర్యవంశీ నిలిచాడు. గతంలో నేపాల్ ఆటగాడు కుశల్ మల్లా 15 ఏళ్ల 340 రోజుల వయసులో ఈ ఘనత సాధించగా, ఇప్పుడు సూర్యవంశీ ఆ రికార్డును కూడా అధిగమించి భారత క్రికెట్‌లో ఓ సరికొత్త అధ్యాయానికి నాంది పలికాడు.


# తిరుమల వెళ్తున్నారా?.. ఈ రూల్ పాటించకపోతే కేసుతో పాటు జరిమానా!

**తిరుమలలో శబ్ద కాలుష్య నియంత్రణకు 'నో హారన్' జోన్ – నిబంధనల అమలుపై టీటీడీ, పోలీసుల ప్రత్యేక దృష్టి**

**గడిచిన 6 నెలల్లో 42 వాహనాలపై కేసులు, జరిమానాలు – 2000కు పైగా సీసీ కెమెరాలతో వాహనాలపై నిరంతర నిఘా**

**భక్తులు, వాహనదారులు సహకరించాలని అధికారుల విజ్ఞప్తి**

సింధూరదర్శిని: తిరుమల పుణ్యక్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణాన్ని పరిరక్షించేందుకు, శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు టీటీడీ, పోలీసులు సంయుక్తంగా 'నో హారన్ జోన్' నిబంధనను కఠినంగా అమలు చేస్తున్నారు. కొండపై అనవసరంగా హారన్లు, సైరన్లు మోగించడాన్ని పూర్తిగా నిషేధించారు. ఈ నిబంధనను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటూ, భారీ జరిమానాలు విధిస్తున్నారు. గడిచిన ఆరు నెలల కాలంలోనే శబ్ద కాలుష్యానికి కారణమైన 42 వాహనాలపై మోటారు వాహన చట్టం కింద కేసులు నమోదు చేశారు. వారి నుంచి రూ.64,475 జరిమానా వసూలు చేసినట్లు అధికారులు వెల్లడించారు. తిరుమలలోని జీఎన్‌సీ టోల్‌గేట్ నుంచి రెండు ఘాట్ రోడ్లతో సహా కొండపై అన్ని ప్రాంతాల్లో ఈ నిబంధన వర్తిస్తుంది. ఎప్పటి నుంచో ఈరూల్ అమల్లో ఉన్నప్పటికీ, చాలామంది వాహనదారులు దీన్ని పట్టించుకోకపోవడంతో ట్రాఫిక్ పోలీసులు, రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ చర్యలు తీవ్రతరం చేశారు. తిరుమల పవిత్రతను కాపాడి, భక్తులకు ప్రశాంతమైన వాతావరణం కల్పించడమే ఈ నిబంధన ముఖ్యోద్దేశమని అధికారులు చెబుతున్నారు. కొండపైకి సొంత వాహనాల్లో వచ్చే భక్తులు, ట్యాక్సీ డ్రైవర్లు ఈ నిబంధనను



తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్సులు, వీవీఐపీ ప్రోటోకాల్ వాహనాలు మాత్రమే సైరన్ ఉపయోగించుకునేందుకు పరిమితమైన వెసులుబాటు కల్పించారు. నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు పోలీస్ కమాండ్ కంట్రోల్ విభాగం ఆధ్వర్యంలో 2000కు పైగా సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా కొనసాగుతోంది. నిబంధనలను అతిక్రమిస్తే కెమెరాల ద్వారా గుర్తించి చలాన్లు పంపడం ఖాయమని అధికారులు హెచ్చరిస్తున్నారు. ఆలయాలు, ప్రశాంత ప్రదేశాల్లో పగటిపూట 50డెసిబుల్స్, రాత్రిపూట 40 డెసిబుల్స్ మించి శబ్దాలు ఉండరాదనే నిబంధన ఉందని, దీనికి అనుగుణంగానే తిరుమలలో 'నో హారన్ జోన్' అమలు చేస్తున్నామని తెలిపారు. భక్తులు సహకరించి, తిరుమల ప్రశాంతతను కాపాడాలని కోరారు.

# నిటారుగా నిద్రపోయే తిమింగలాలు.. శాస్త్రవేత్తలను ఆశ్చర్యపర్చిన రహస్యం

**స్పెర్మ్ వేల్‌లపై కొత్త అధ్యయనం – నిటారుగా నిల్చునే నిద్ర – గాలి బుడగలతో బ్యాలెన్స్**

**ఉపరితలానికి దగ్గరగా విశ్రాంతి – ఇందులో స్పెర్మాసెటి ఆయిల్ కీలక పాత్ర**

**నిద్రలోనూ బుడగల నియంత్రణ**



సముద్ర జీవుల గురించి మనకు తెలిసింది చాలా తక్కువ. అప్పుడప్పుడూ శాస్త్రవేత్తలు చేసే పరిశోధనలు వాటి జీవితంలో దాగి ఉన్న ఆశ్చర్యకరమైన విషయాలను బయటపెడుతుంటాయి. తాజాగా ప్రపంచంలోనే అతిపెద్ద దంతాలున్న తిమింగలాల్లో ఒకటైన 'స్పెర్మ్ వేల్' నిద్రపోయే తీరు శాస్త్రవేత్తలను ఆశ్చర్యానికి గురి చేసింది. మనుషులు, భూమిపై ఉండే జంతువుల మాదిరిగా కాకుండా ఇవి సముద్రంలో నిటారుగా నిల్చున్నట్టే నిద్రపోతాయని గుర్తించారు. ఆ సమయంలో నీటిలో తేలుతూ ఉండేందుకు చిన్న చిన్న గాలి బుడగలను విడుదల చేస్తాయని తాజా అధ్యయనం వెల్లడించింది.

సెయింట్ ఆండ్రూస్ విశ్వవిద్యాలయం, యూనివర్సిటీ ఆఫ్ న్యూషాటెల్ శాస్త్రవేత్తలు నార్వే తీరంలో స్పెర్మ్ వేల్‌లపై ప్రత్యేక సక్షన్-కప్ ట్యాగ్‌లను అమర్చి వాటి కదలికలు, శబ్దాలను రికార్డు చేశారు. ఈ డేటాను విశ్లేషించగా, విశ్రాంతి సమయంలో తిమింగలాలు దాదాపు కదలకుండా నీటిలో నిటారుగా నిలిచి ఉంటాయని గుర్తించారు. తల నీటి ఉపరితలం వైపు ఉండగా, శరీరం కిందికి వేలాడుతూ ఉండే ఈ భంగిమ ఇతర తిమింగలాల్లో కనిపించదని పరిశోధకులు తెలిపారు.

ఈ భంగిమ వల్ల వాటికి అనేక ప్రయోజనాలు ఉన్నాయి. నిద్రలేచిన వెంటనే శ్వాస తీసుకునేందుకు ఉపరితలానికి దగ్గరగా ఉండటం సులభమవుతుంది. అలాగే సముద్ర అలల ప్రభావం తక్కువగా ఉండటంతో పాటు లోతైన నీటిలోకి కొట్టుకుపోకుండా శక్తిని ఆదా చేసుకోవచ్చు. అందుకే ఈ ప్రత్యేకమైన నిద్ర భంగిమను అవి ఎంచుకుంటాయని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

స్పెర్మ్ వేల్‌ల తలలో స్పెర్మాసెటి ఆయిల్ అనే మైనంలాంటి పదార్థంతో నిండిన ప్రత్యేక అవయవం ఉంటుంది. ఇది అవి తేలడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అయితే విశ్రాంతి సమయంలో ఊపిరితిత్తుల్లోని వాయువు విస్తరించడంతో అవి పైకి తేలే అవకాశం ఉంటుంది. దీనిని సమతుల్యం చేసేందుకు అవి చిన్న చిన్న గాలి బుడగలను విడుదల చేస్తాయి. దీంతో నీటిలో దాదాపు బరువులేనట్టుగా స్థిరంగా తేలుతూ నిద్రపోగలుగుతాయి. మరో ఆసక్తికర విషయం ఏమిటంటే... ఈ సూక్ష్మ సమతుల్యతను స్పెర్మ్ వేల్‌లు నిద్రలోనే నియంత్రించగలగడం. భూమిపై ఉండే జంతువుల్లో ఇలాంటి ప్రవర్తన ఇప్పటివరకు కనిపించలేదని పరిశోధకులు చెబుతున్నారు. అంతేకాదు, ఈ గాలి బుడగలు శరీరంలోని అదనపు కార్బన్ డయాక్సైడ్ లేదా నైట్రోజన్‌ను బయటకు పంపడంలో కూడా సహాయపడే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. దీనిపై మరిన్ని పరిశోధనలు జరిగితే సముద్ర గర్భంలో తిమింగలాల జీవన విధానం గురించి మరిన్ని కొత్త విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.

# గైస్! ఇవన్నీ వారానికి ఒకసారైనా తినండి ..! లేకపోతే ప్రమాదం ఎక్కువ ...







పురుషుల శరీర కూర్పు మరియు వారి మానసిక స్థితి చాలా తేడా ఉంటుంది. ఇది ప్రతి మనిషికి భిన్నంగా ఉంటుంది. పురుషులు తమ రోజువారీ పనులను మరియు ఇంటి జీవితంలో సంతోషంగా ఉండటానికి ఆహారాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. కానీ, ఇప్పుడు మనం తినే ఆహారాలన్నీ మన శరీరానికి బలాన్ని చేకూరుస్తాయా ..? అని అడిగితే, సమాధానం లేదు. పురుషులు శరీరానికి ఎక్కువ శక్తినిచ్చే ఆహారాన్ని తీసుకుంటేనే శరీరంలో సమతుల్య రక్త ప్రవాహం ఉంటుంది మరియు స్పెర్మ్ యొక్క కార్యాచరణ ఎక్కువగా ఉంటుంది. లేకపోతే అవి మన జీవితమంతా నాశనం కావచ్చు. మగవారికి సమస్యలు ఉండకూడదనుకుంటే వారానికి ఒకసారైనా ఈ 11 ఆహారాలు తినండి. మెంతులు ఈ మెంతులు పురుషుల వివిధ సమస్యలను పరిష్కరించే శక్తిని కలిగి ఉంటాయి. దీనిలోని పొటాషియం రక్త ప్రవాహాన్ని నియంత్రిస్తుంది మరియు స్పెర్మ్‌ను ఆరోగ్యంగా ఉంచుతుంది. అందువల్ల, వారానికి ఒకసారైనా మీ ఆహారంలో మెంతులు చేర్చండి. చిక్పీస్ ఇలాంటి ఆహారాల గురించి చాలా మంది మర్చిపోయారు. కానీ, ఇది పురుషులకు చాలా ముఖ్యమైన ఆహారాలలో ఒకటి. వీటిలో ప్రోటీన్ మరియు ఫైబర్ అధికంగా ఉంటాయి. కాబట్టి శరీర పెరుగుదల సజావుగా ఉంటుంది. పురుషులు వారానికి ఒకసారైనా చిక్‌పీస్ తినాలి. గ్రీన్ టీ యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఈ గ్రీన్ టీని పురుషులు వారానికి ఒకసారైనా తాగాలి. ఈ గ్రీన్ టీ జననేంద్రియాలకు వచ్చే నష్టాన్ని సరిచేయడానికి సహాయపడుతుంది. అలాగే, మీరు దీన్ని రోజూ తాగితే, మీకు చాలా రెట్లు ప్రయోజనం ఉంటుంది. క్యారెట్లు ఈ క్యారెట్ పురుషులకు మంచి స్నేహితుడిగా పరిగణించబడుతుంది. అంగస్తంభన మరియు స్పెర్మ్ దెబ్బతినడం వంటి సమస్యలను వారానికి ఒకసారి తినడం ద్వారా పరిష్కరించవచ్చు. క్యారెట్‌కు క్యాన్సర్‌ను నివారించే సామర్థ్యం కూడా ఉంది. ఎరుపు మాంసం పురుషులు సాధారణంగా ఇలాంటి ఎర్ర మాంసాన్ని తినడం వల్ల ప్రయోజనం పొందుతారని అధ్యయనాలు చెబుతున్నాయి. జింక్, ఐరన్, ప్రోటీన్ మొదలైనవి అధికంగా ఉండటం వల్ల పురుషుల శరీరానికి ఎక్కువ బలం లభిస్తుంది. అందువల్ల, మేక, గొడ్డు మాంసం మొదలైన మాంసాన్ని వారానికి 1 సమయం తీసుకోవచ్చు. డార్క్ చాక్లెట్ చాలా మంది పిల్లలు చాక్లెట్‌ను పిల్లలు మాత్రమే తినగలిగే ఆహారంగా చూస్తారు. అయితే, ఇది పురుషులకు ప్రధానమైన ఆహారం. ఎటువంటి సమ్మేళనం లేని చాక్లెట్ తినడం వల్ల పురుషులలో రక్త ప్రవాహం మరియు ఒత్తిడిని కాపాడుకోవచ్చు. అరటి ప్రపంచంలో అత్యధిక పొటాషియం అధికంగా ఉండే ఆహారాలలో అరటిపండు ఒకటి. పురుషులు దీన్ని తప్పక తినాలి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచుతాయి మరియు వివాహాన్ని మరింత శక్తివంతం చేస్తాయి. చిక్కుళ్ళు రకాలు కేవలం బియ్యాన్ని పురుషుల ఆహారంలో చేర్చడం మంచిది కాదు. అందువల్ల, చిక్కుళ్ళు చేర్చడం తప్పనిసరి. ఇవి బరువు తగ్గడానికి మరియు పురుషులను ఆరోగ్యంగా ఉంచడానికి మీకు సహాయపడతాయి. టమాటో రసం టొమాటోస్‌లో లైకోపీన్ అనే ప్రధాన పదార్థం ఉంటుంది, దీనిని రసంగా తయారు చేసి వారానికి ఒకసారి తాగవచ్చు. అదనంగా ఇది క్లోమం, పెద్దప్రేగు మరియు ప్రోస్టేట్ క్యాన్సర్‌ను నివారించడంలో సహాయపడుతుంది. అవోకాడో ఈ అవోకాడో పండు పురుషుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. చెడు కొలెస్ట్రాల్ అధికంగా ఉన్నందున దీన్ని వారానికి ఒకసారైనా తినడం మంచిది. ఈ పండు అధిక రక్తపోటును తగ్గిస్తుంది. కోజీ బెర్రీ ఈ ఆహార పదార్థం అనేక వేల సంవత్సరాలుగా బాగా ప్రాచుర్యం పొందింది. దీనిపై చేసిన పరిశోధనలో కొన్ని గొప్ప సమాచారం లభించింది. అంటే వారానికి ఒకసారైనా కోజీ బెర్రీ తినే పురుషులు జననేంద్రియ క్యాన్సర్ నుంచి బయటపడవచ్చు.






## మినరల్ వాటర్ వేడి చేసి త్రాగవచ్చా? అలా త్రాగితే ఏమౌతుంది...!




శీతాకాలం మరియు వర్షాకాలం ప్రారంభం కావడంతో, జ్వరం, జలుబు, తలనొప్పి, అనారోగ్యాలు, ఉబ్బసం మరియు తలనొప్పి వంటి ఆరోగ్య సమస్యలు పెరుగుతూనే ఉంటాయి. ఆ సందర్భాలలో నీరు ఎక్కువ దాహంతో పడుతుంది. మీరు ఎంత శుభ్రమైన నీరు తాగినా, మీరు ఎప్పటికీ సంతృప్తి చెందరు. ఆ సమయంలో మన నాలుకకు వేడి నీటిని త్రాగడం తప్ప వేరే మార్గం ఉండదు. చల్లని, వర్షాకాలం చలి మరియు వర్షాకాలంలో మీరు ఎంత నీరు తాగినా,గొంతులో పొడి పెరుగుతూనే ఉంటుంది. ఇలాంటి సమయాల్లో దాహం కోసం వేడినీరు తాగుతారా? వీటికి కలుషితమైన నీరు అనుమానంతో సాధారణ నీరు తాగాలా లేక మినరల్ వాటర్ తాగాలా అనే గందరగోళం మీకు ఉంటుంది. మీరు దాని గురించి ఇక్కడ తెలుసుకోచ్చు. మినరల్ వాటర్ వేడి చేయ వచ్చా? మన శరీరానికి అవసరమైన ఖనిజాలు, మినరల్ లవణాలు మరియు శుద్ధి చేసిన లవణాలతో కలిపి మినరల్ వాటర్ వేడిచేసి త్రాగితే, దానిలోని అన్ని పోషకాలు పోతాయి అని మనలో కొందరు వినే ఉంటారు. కాబట్టి నిజం ఏమిటి? శుద్ధి చేసిన నీరు సాధారణంగా మనం బయట నీరు కొని తాగుతాం. కొన్ని నిర్దిష్ట బ్రాండ్లు మినహా అన్నీ ఆర్వో. అది శుద్ధి చేసిన నీరు. మనలో కొందరు కొన్ని వేలు ఖర్చు చేసి మన సొంత ఇళ్లలోనే ఇన్‌స్టాల్ చేసుకుంటారు. అంటే మనం తాగడానికి శుద్ధి చేసిన నీటిని ఉపయోగిస్తున్నాం. పోషకాలు అయిపోతాయా? శుద్ధి చేసిన నీటిలో ఉన్న అధిక భాస్వరం లాంటి లవణాలు శుద్ధీకరణ సమయంలో విడుదలవుతాయి. అది కాకుండా ఇతర పోషకాలు విడుదల చేయబడవు. భాస్వరం ముగిసిన తర్వాత, ఇది సాధారణ తాగునీటిలా ఉంటుంది. కాబట్టి ఈ నీటిని సాధారణ నీటి మాదిరిగానే వేడి చేయవచ్చు. అందువలన పోషకాలు విడుదల చేయబడవు. బాక్టీరియా నీటిని మళ్లీ మళ్లీ వేడి చేయవచ్చా అని కొందరు ప్రశ్నిస్తున్నారు. మీరు మళ్లీ వేడి చేసి త్రాగవచ్చు. తద్వారా నీటిలోని పోషకాలు విడుదల కావు. సాధారణంగా మనం ఒక విషయం అర్థం చేసుకోవాలి. నీరు బాహ్య మాధ్యమం లాంటిది. వేడి మరియు గాలి దానిపై పడినప్పుడు, అవి నీటిని ప్రభావితం చేయటం ప్రారంభిస్తాయి. నీటిలో గాలి మరియు వేడి బ్యాక్టీరియా ఏర్పడటం ప్రారంభిస్తుంది. ఇది సాధారణ నీరు, శుద్ధి చేసిన నీరు మరియు మినరల్ వాటర్‌కు వర్తిస్తుంది. ఎంత సమయంలో మీరు వాటర్ బాటిల్ లేదా మినరల్ వాటర్ బాటిల్ తెరిచిన తర్వాత 24 గంటల్లో వాడటం మంచిది.



లేకపోతే అందులో బ్యాక్టీరియా పెరగడం ప్రారంభమవుతుంది. అందుకే మినరల్ వాటర్ బాటిల్స్ కూడా మళ్లీ తాగి విస్మరించాలని, తిరిగి వాడకూడదని వారు అంటున్నారు. ఎత్తైన ప్రాంతాలలో సాధారణంగా నీటి శు ద్ధీకరణ వ్యవస్థ పాశ్చాత్య దేశాలకు మరియు మన దేశాల మధ్య చాలా తేడాలు కలిగి ఉంది. ఎత్తైన ప్రదేశాలలో, స్వచ్ఛమైన జలపా తాల నుండి నీరు శుద్ధి చేయబడి, అవసరమైన నిష్పత్తిలో సోడియం, పొటాషియం, మెగ్నీషియం మరియు కాల్షియం వంటి ఖనిజాలతో కలుపుతారు. అది నిజంగా మినరల్ వాటర్. స్వేదన మినరల్ వాటర్ తాగవద్దు. ఇటువంటి స్వేదనం అదనపు ఖనిజాలను పనికిరానిదిగా చేస్తుంది.

## పాప్‌కార్న్‌తో గుండె సమస్యలు

సినిమా చూస్తున్నప్పుడో, క్రికెట్ చూస్తున్నప్పుడో సరదాగా పాప్‌కార్న్ తినాలని చాలామందికి అనిపి స్తుంటుంది. కానీ, వీటిని ఎక్కువగా తినడం మంచిది కాదంటున్నారు

**వైద్య నిపుణులు.**

ఏదైనా పనిలో పడితే ఎంత తింటున్నామో, ఏం చేస్తున్నామో ఒక్కోసారి పట్టించుకోం. సినిమా థియే టర్లలోనూ సినిమా చూస్తూ పాప్‌కార్న్ ఎంత తింటున్నామో కూడా పట్టించుకోం. ఇలా ఎక్కువ పాప్‌కార్న్ తినడం వల్ల గుండె సంబంధిత సమస్యలు తలెత్తుతాయట. నాన్‌స్టిక్ కుక్‌వేర్, ప్యాకింగ్ చేసినటు వంటి పాప్‌కార్న్ వంటి వాటిలో పెర్‌ఫ్లోరూక్టానిక్ యాసిడ్ రసాయనం ఉన్నట్లు కనుగొన్నారు. ఇలాంటి పదార్థాల ను తీసుకొనే వెయ్యి మందిపై పరీక్షలు జరిపాకే ఈ విషయం వెల్లడించారు శాస్త్రవేత్తలు. ఈ రసాయనం రక్తంలో ఎక్కువ మోతాదులో ఉన్నట్లు కనుగొన్నారు. దీనివల్ల గుండె సమస్యలు తలెత్తాయంటున్నారు. అయితే పూర్తి స్థాయిలో ఈ పరిశోధనలు జరుగలేదట. కాబట్టి ఇది సరైన పరిశోధనా? కాదా? అని



నిర్ధారించలేమంటున్నారు వైద్యులు. ఏదైనా మితంగా తింటే పర్వాలేదని సలహా కూడా ఇస్తున్నారు.

## వీర్యంతో మహిళల ఆరోగ్యం భేష్!



హాలో గురూ! ప్రేమ కోసమేరా జీవితం.. మగాడితో ఆడదానికేల పౌరుషం అన్నాడు గణేశ్ పాత్రో. మాటలు రాసే అతడు మాటలు కన్నా ఘాటుగా పాట రాసిపారేశాడు. ఇంతకీ ఆడ – మగ మధ్య ఘటు ప్రేమ నాటుకు పోవాలి అంటే.. మహిళలు మానసికంగా .. శారీరకంగా ఉల్లాసంగా ఉండాలీ అంటే ఏం చేయాలి? ఆడవారు మానసిక ఉల్లాసానికి మగాడి వీర్యం సరిపోతుందని చెబుతున్నారు. అదే పనిగా ఆమెను పొగడాలా.. లేకా షాపింగ్‌లకూ.. సినిమాలకూ.. షికార్లకూ విచ్చలవిడిగా ఖర్చు చేసుకో అని క్రెడిట్ ఆర్ డెబిట్ కార్డులివ్వాలా.. అంటే అవేవీ వద్దు.. శృంగారమే ముద్దు అంటున్నారు పరిశోధకులు. దస్టేట్ యూనివర్సిటీ ఆఫ్ న్యూయార్క్ స్టడీలో.. మానసికంగా, శారీరకంగా మహిళలు ఆరోగ్యంగా ఉండేందుకు వీర్యం సహరిస్తుందని తేలింది. ఎలాంటి కండోమ్స్ వాడకుండా సెక్స్ జరిపే మహిళలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండేందుకు కారణః౦ వీర్యమని పరిశోధకులు చెబుతున్నారు. వీర్యంలో ఉండే కొన్ని కెమికల్స్ మహిళల మెదడుపై ప్రభావం చూపుతుందట. దీనివల్ల రోజంతా ఆడాళ్లు ఆరళ్లు పెట్టక మంచి మూడ్ లో ఉంటారట. ఓ రకంగా మహిళల ఆరోగ్యానికి వీర్యం ఔషధం లాంటిదని పరిశోధకులు చెబుతున్నారు.

# సినిమా న్యూస్

## ‘చెన్నై లవ్‌స్టోరీ’ మూవీ రివ్యూ



ఇప్పటి వరకు ఎన్నో ప్రేమకథలు వెండితెరపై ఆవిష్కరించబడ్డాయి. ఈ ప్రేమకథలను కొత్తగా ప్రజెంట్ చేయగలిగితే ప్రేక్షకులు ఆదరిస్తారు అనే నమ్మకంతో దర్శకులు సరికొత్త ప్రేమకథలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఈ కోవలోనే ‘బేబీ’ సినిమాతో ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగా జాతీయ అవార్డును అందుకున్న సాయిరాజేష్ తన కథతో, ఎస్‌కేఎన్‌తో కలిసి నిర్మించిన చిత్రం ‘చెన్నై లవ్‌స్టోరీ’. కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకుడు. ఈ చిత్రం ప్రచారంలో ముందు నుంచే ఇదొక కల్ట్ బ్లాక్‌బస్టర్ అనే ట్యాగ్‌ను యాడ్ చేసిన ఈ చిత్రం ప్రేక్షకులను అలరించిందా? ఈ ప్రేమకథలో అందరి హృదయాలను హత్తుకునే అంశాలున్నాయా? లేదా? అనేది చిత్ర సమీక్షలో తెలుసుకుందాం...

నివి (శ్రీ గౌరి ప్రియ) మూడేళ్లుగా ప్రేమించిన అబ్బాయి అజయ్ (త్రిగుణ్)ని పెళ్లి చేసుకోని అందమైన జీవితాన్ని గడపాలని ఊహించుకుంటుంది. కానీ పెళ్లి ముహూర్త సమయానికి అజయ్ తనకు ఈ పెళ్లి ఇష్టం లేదని, తాను మరో అమ్మాయిని ఇష్టపడుతున్నానని, నివికి బ్రేకప్ చెప్పి బెంగళూరు వెళ్లిపోతాడు. ఈ సంఘటనతో షాక్‌లో ఉన్న ఆమె మనసు ముక్కలైపోతుంది. ఈ బాధని మరిచిపోవడానికి తన స్నేహితులతో కలిసి చెన్నై వెళ్లిపోతుంది. ఊరు మారినా తన మనసు మారదు. విఫలప్రేమ బాధ నుంచి బయటపడటానికి ఆల్కహాల్‌కు అలవాటుపడుతుంది.

ఈ సమయంలోనే సినిమా రంగంలో దర్శకత్వ అవకాశం కోసం వేచి చూస్తున్న అనాథ స్టీవెన్ శంకర్ (కిరణ్ అబ్బవరం) నివి స్నేహితులు ఉండే ఇంట్లోనే ఆశ్రయం సంపాందిస్తాడు. ఆ ఇంట్లో అందరితో సరదాగా ఉండే స్టీవెన్ పనులు మాత్రం నివికి విసుగు తెప్పిస్తాయి. స్టీవెన్ విషయంలో తన ప్రవర్తన కరెక్ట్ కాదని తెలుసుకున్న తను క్రమంగా అతడ్ని ఇష్టం పడటం మొదలుపెడుతుంది. స్టీవెన్ మాత్రం ఆమెను ఓ దేవతలా ఆరాధిస్తుంటాడు. ఓ రోజు సడన్‌గా ‘మనం పెళ్లి చేసుకుందామా’ అని అడుగుతుంది. అప్పుడు స్టీవెన్ ఏం చేశాడు? వీళ్ల ప్రేమకథ సక్సెస్ అవుతుందా? పెళ్లిపీటల మీద పెళ్లిని కాదని వెళ్లిపోయిన అజయ్ మళ్లీ నివి జీవితంలోకి ఎందుకొచ్చాడు? స్టీవెన్ శంకర్‌కు దర్శకత్వ చాన్స్ వచ్చిందా? నివి ఎవరిని పెళ్లి చేసుకుంది అనేది మిగతా కథ.

“ప్రతి ప్రేమకథ ఒకేలా ఉంటే చరిత్రకు కూడా నచ్చదండీ” అనే ఓ డైలాగ్ ఈ చిత్రంలో ఉంటుంది. అందుకే ఈ చిత్ర కథా రచయిత ఈ ప్రేమకథను చాలా కొత్తగా ఆలోచించాడు. “తొలిప్రేమ ఎప్పటికీ మధుర జ్ఞాపకమే. అది మనసు పొరల్లో శాశ్వతంగా ఉండిపోతుంది” అంటూ ‘బేబీ’తో హృదయానికి హత్తుకునే ప్రేమకథను చెప్పిన.. దర్శకుడు సాయి రాజేష్.. ఈసారి తొలి ప్రేమ తోపు కాదు అంటూ మరో వినూత్న ప్రేమకథను ‘చెన్నై లవ్‌స్టోరీ’తో అందించాడు. అయితే ఈ లవ్‌స్టోరీ చాలా నిదానంగా ప్రారంభమవుతుంది. ఇక స్టీవెన్ శంకర్ పాత్ర ప్రవేశంతో కథ ఊపందుకుంటుంది. ఆయన పాత్రలోని అమాయకత్వం, చలాకీతనంతో ప్రేక్షకులు ప్రేమలో పడిపోతారు. ప్రతి సన్నివేశం ఎంతో ఆహ్లాదంగా ముందుకు సాగుతుంది. కథానాయిక పాత్ర కూడా ఆసక్తికరంగా మలచడంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా కథనం హాయిగా సాగిపోతుంది. ముఖ్యంగా హీరోయిన్ పాత్రలో మార్పు కోసం హీరో చేసే అల్లరి పనులు, తానొక అనాథ అని హీరో చెప్పే సన్నివేశంలోని ఎమోషన్ అందరి హృదయాలను కదిలిస్తుంది.

ఫస్టాఫ్‌లో వచ్చే గుర్తుందా పాట అలరిస్తుంది. ఇక ఇంటర్వెల్‌కు సమయానికి కథ షాకింగ్ టర్న్ తీసుకుంటుంది. ఈ సీక్వెన్స్ చూశాక దర్శకుడు సెకండాఫ్‌ను ఎలా డీల్ చేస్తాడా? అనే ఆసక్తి అందరిలో మొదలవుతుంది. అయితే దర్శకుడు ముందే ఇచ్చిన హింట్స్ ప్రకారం దాదాపు అందరూ ద్వితీయార్థాన్ని ఊహించుకుంటూనే సెకండాఫ్‌లోకి ఎంట్రీ అవుతారు. డైరెక్టర్‌కి ఇక్కడే అసలు పరీక్ష మొదలవుతుంది. తన కన్వీనెంట్‌గా సన్నివేశాలు రాసుకుని, కొత్తదనం కోసం ప్రయత్నించినా అది కన్విన్సింగ్‌గా అనిపించదు. తాను సెకండాఫ్‌లో చెప్పాలనుకున్న విషయాన్ని ఫస్టాఫ్‌లో కొన్ని సన్నివేశాలతో దర్శకుడు రిజిష్టర్ చేసే ప్రయత్నం చేసి ఆడియన్స్‌ను ప్రీపేర్ చేసిన భావన కలుగుతుంది.

అందరూ ఊహించునట్టుగానే సెకండాఫ్‌లో ఈ లవ్‌స్టోరీ కాస్త తడబడింది.. అయితే కొన్ని హార్ట్ టచ్చింగ్ సీన్స్‌తో దర్శకుడు కథను ఎక్కడ పడిపోతున్న ఫీల్ కలగకుండా మేనేజ్ చేశాడు. ఈ సినిమా ద్వితీయార్థం చూస్తున్నప్పుడు కొన్ని ఆల్రెడీ చూసిన సినిమాలు గుర్తుకొచ్చినా.. మరో బలమైన సన్నివేశంతో ఆ భావనను ఆడియన్స్ మైండ్‌లో నుంచి తుడిచిపెట్టే విధంగా దర్శకుడు సెకండాఫ్‌ని హ్యాండిల్ చేశాడు. ద్వితీయార్థంలో కుక్కల ఫైటింగ్.. స్మశానంలో హీరోయిన్ సీన్, పతాక సన్నివేశాలు కీలకంగా నిలిచాయి. అయితే సెకండాఫ్‌ను రచనా పరంగా మరింత బలంగా రాసుకుని ఉంటే కథనం ప్రేక్షకుల ఊహకు అందకుండా థ్రిల్‌ను కలిగించేంది.

ఈ సినిమాకు కిరణ్ అబ్బవరం నటన బిగ్గెస్ట్ ప్లస్ పాయింట్. స్టీవెన్ శంకర్‌గా ఆయన పర్‌ఫార్మెన్స్‌లో మెచ్యూరిటి కనిపించింది. ఎంతో నేచురల్‌గా ఆ పాత్రలో ఒదిగిపోయాడు. ఈ సినిమాతో నటుడిగా ఆయన మరో మెట్టు ఎక్కాడు. నివి పాత్రలో గౌరీప్రియ అలరించింది. ఓ కథానాయికకు ఇలాంటి పాత్ర లభించడం చాలా అరుదు. ఆమె తన పాత్రకు పర్‌ఫెక్ట్ చాయిస్ అనిపించింది. లవ్‌ఫెయిల్యూర్ అమ్మాయిలా ఆమెలోని భావోద్వేగపూరిత నటన అందరి హృదయాలను హత్తుకుంటుంది. త్రిగుణ్ కూడా తన పాత్రకు న్యాయం చేశాడు.

స్నేహితులుగా సిరి హనుమంతు, పూజ, నవీన్, కార్తీక్‌లు తమ పరిధి మేరకు నటించారు. దర్శకుడు రవి నంబూరి అనుభవం ఉన్న దర్శకుడిలా ఇలాంటి సెన్సిటివ్ లవ్‌స్టోరీని తెరపై చక్కగా ఆవిష్కరించాడు. దర్శకులు పి.వాసు, కరుణకుమార్ అతిథి పాత్రల్లో మెరిశారు. మణిశర్మ సంగీతం ఈ చిత్రానికి చాలా ప్లస్ అయ్యింది. సాంకేతిక పరంగా ఆయనకే ఎక్కువ మార్కులు పడతాయి. పాటలన్నీ క్యాచీగా వినసొంపుగా ఉన్నాయి. నేపథ్య సంగీతం చిత్రంలోని సోల్‌ను నిలబెట్టింది. ఈ మధ్య కాలంలో మూడు గంటలపైగా నిడివితో విడుదలైన చిన్న సినిమా ఇదే. సినిమా లెంగ్త్ పెద్ద ప్రాబ్లమ్‌గా అనిపించకపోయినా, ట్రీమ్ చేసుకునే స్కోప్ మాత్రం కనిపించింది.

కొత్త తరహా ప్రేమకథతో ప్రేక్షకుల ముందుకొచ్చిన ‘చెన్నై లవ్‌స్టోరీ’లో ప్రేమ గొప్పదనాన్ని, ప్రేమలోని నిజాయితీని చాటి చెప్పే ప్రయత్నం చేశారు. తెలుగు సినిమాల్లో ఇప్పటి వరకు వచ్చిన సరికొత్త ప్రేమకథల్లో ఈసినిమాకు ఓ ప్రత్యేక స్థానం ఉంటుంది. ఎమోషన్స్, ఎంటర్‌టైన్‌మెంట్, సెన్సిబులిటీస్ మేళవించిన ఈ ప్రేమకథలో చిన్న చిన్న లోటుపాట్లు ఉన్నా, ప్రేమకథలను ఇష్టపడే అందరి హృదయాలను హత్తుకుంటుంది.

**సినిమా వివరాలు**

సినిమా పేరు: చెన్నై లవ్ స్టోరీ

విడుదల తేదీ: 2026-07-24

తారాగణం: కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరీ ప్రియ, సిరి హనుమంతు, మహేందర్, నరేష్, పూజ

దర్శకుడు: రవి నంబూరి

సంగీతం: మణి శర్మ


బ్యానర్: అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్

సమీక్ష: మదురి మధు

చెన్నై లవ్ స్టోరీ రేటింగ్: 5కి 2.75

## రిలీజ్ డేట్ గేమ్ ప్లాన్... దసరా -దీపావళి సీజన్‌పై కన్నేసిన భారీ సినిమా!

రౌడీ హీరో విజయ్ దేవరకొండ, ‘టాక్సీవాలా’ ఫేమ్ రాహుల్ సాంకృత్యన్ కాంబినేషన్‌లో వస్తున్న భారీ పీరియడ్ డ్రామా ‘రణబాలి’ పై అంచనాలు విపరీతంగా ఉన్నాయి. స్వాతంత్ర్యానికి పూర్వం నడిచే కథాంశంతో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా రిలీజ్ డేట్ విషయంలో మేకర్స్ ఒక పక్కా ప్లాన్‌తో ముందడుగు వేస్తున్నారు. మొదట సెప్టెంబర్ 11న రిలీజ్ అనుకున్నారు. కానీ క్వాలిటీ కోసం పండుగకు విడుదల చేయాలని ప్లాన్ మార్చారు. ఆ వివరాలు చూద్దాం. తొందరపడకుండా క్వాలిటీకే ప్రాధాన్యం: భారీ బడ్జెట్, విజువల్ వండర్‌గా తెరకెక్కుతున్న ‘రణబాలి’ పోస్ట్ ప్రొడక్షన్ పనులకు కాస్త ఎక్కువ సమయం పడుతోంది. హడావుడిగా రిలీజ్ చేసి క్వాలిటీ విషయంలో కాంప్రమైజ్ అవ్వడం కంటే, అన్ని పనులూ పూర్తి చేసుకుని ఒక పెద్ద పండుగ సీజన్‌లో రావడం మార్కెట్ పరంగా చాలా తెలివైన నిర్ణయం. మైత్రీ మూవీ మేకర్స్, టి-సిరీస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ ప్రాజెక్ట్‌లో గ్రాఫిక్స్, క్వాలిటీ అస్సలు తగ్గకుండా ఉండేందుకే మేకర్స్ ఈ నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. దసరా లేదా దీపావళి.. బాక్సాఫీస్ ఓపెనింగ్స్‌పై కన్ను: సినిమాకు భారీ ఓపెనింగ్స్ రాబట్టేందుకు ఫెస్టివల్ సీజన్ చాలా ప్లస్ అవుతుంది. ఒకవేళ మెగాస్టార్ చిరంజీవి ‘విశ్వంభర’ చిత్రం దసరా రేసు నుంచి పక్కకు తప్పుకుంటే, అక్టోబర్ 16న దసరా కానుకగా ‘రణబాలి’ని థియేటర్లలోకి తెచ్చే ఆలోచనలో ఉన్నారు. ఇక అలా కుదరని పక్షంలో నవంబర్ 6న దీపావళి రేసులో గ్రాండ్‌గా దింపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక పండుగ సెలవులను వాడుకోవడం ద్వారా పాన్-ఇండియా స్థాయిలో కలెక్షన్ల వర్షం కురిపించవచ్చనేది టీమ్ గేమ్ ప్లాన్. క్రేజీ కాంబోలు.. స్కై హై అంచనాలు: పెళ్లి తర్వాత విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక కలిసి నటిస్తున్న మొదటి సినిమా ఇదే కావడంతో దీనిపై ప్రత్యేకమైన ఆసక్తి నెలకొంది. దీనికి తోడు ‘ది మమ్మీ’ ఫేమ్ హాలీవుడ్ నటుడు ఆర్నాల్డ్ వోస్లూ ఈ సినిమాలో పవర్‌ఫుల్ విలన్‌గా నటిస్తున్నారు. ఇక బాలీవుడ్ మ్యూజిక్ డైరెక్టర్లు అజయ్-అతుల్ అందిస్తున్న సంగీతం, ఆల్ రెడీ లీకైన పిక్స్ సినిమాపై హైప్‌ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లాయి. బాక్సాఫీస్ రికార్డులపై రౌడీ వేట: ‘టాక్సీవాలా’ లాంటి సూపర్ హిట్ తర్వాత విజయ్-రాహుల్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమా ఖచ్చితంగా బాక్సాఫీస్ దగ్గర సంచలనం సృష్టిస్తుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. సరైన రిలీజ్ డేట్‌ను లాక్ చేసుకుని ఫెస్టివల్ సీజన్‌ను సరిగ్గా క్యాష్ చేసుకుంటే, ‘రణబాలి’ విజయ్ దేవరకొండ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ బ్లాక్‌బస్టర్‌గా నిలవడం ఖాయంగా కనిపిస్తోంది. 2



## రియలిస్టిక్ అప్రోచ్‌తో నోలన్ సంచలనం!



ప్రపంచ సినిమా చరిత్రలో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు క్రిస్టోఫర్ నోలాన్ మరోసారి ‘ది ఒడిస్సీ’ తో ప్రేక్షకుల్ని అలరిస్తోన్న సంగతి తెలిసిందే. సినినమాలో ప్రతీ ప్రేమ్ ను ఎంతో అందంగా.. అద్భుతంగా చెక్కారు. టెక్నికల్ గానూ సినిమా ఎంతో అప్ డేట్ గా హైలైట్ అయింది. అయితే ఈ సినిమా కోసం నోలన్ కేవలం కంప్యూటర్ గ్రాఫిక్స్ మీద ఆధారపడకుండా ప్రాకృతిక వాతావరణంలోనే సహజ సిద్ధమైన ఎఫెక్ట్స్‌ను సృష్టించడం ప్రత్యేకతగా నిలిచింది. 10 అడుగులు భారీ కాయులను చూపించేందుకు డిజిటల్ టెక్నాలజీని పక్కన పెట్టి సరికొత్త ప్రాక్టికల్ పద్ధతులను అవలంబించడం తాజాగా పరిశ్రమలో చర్చనీయాంశమైంది. ఈ చిత్రంలో పది అడుగుల ఎత్తుండే భారీ మానవుల పాత్రలను సృష్టించడానికి నోలాన్ ఎలాంటి డిజిటల్ మాయాజాలాన్ని ఉపయోగించలేదు. దీనికోసం ప్రత్యేకమైన నిష్పత్తులు కలిగిన భౌతిక నమూనాలు, కెమెరా యాంగిల్స్ , వినూత్న పద్ధతులను రంగంలోకి దించారు. విజువల్ ఎఫెక్ట్స్ గ్రీన్ స్క్రీన్‌ల కంటే రియల్ సెట్స్‌లో నటించడం వల్ల నటులకు సహజమైన హావభావాలు పండించడానికి అవకాశం ఉంటుందని బలంగా నమ్మారు. ఈ తరహా రియలిస్టిక్ అప్రోచ్ సినిమా అనుభూతిని నెక్స్ట్ లెవల్‌కు తీసుకువెళ్లిందని విశ్లేషకులు భావిస్తున్నారు. సినిమాలో హాలీవుడ్ నటుడు మ్యాట్ డ్యామన్ ప్రధాన పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. చిత్రంలోని కొన్ని కఠినమైన, ప్రమాదకరమైన యాక్షన్ సన్నివేశాల కోసం ఆయన స్థానంలో ఒక మహిళా స్టంట్ డబుల్‌ను ఉపయోగించడం మరో విశేషం. జెండర్ బ్యారియర్స్‌ను దాటి ప్రతిభే ప్రామాణికంగా నిపుణులను ఎంపిక చేయడం లో నోలాన్ ఎప్పుడూ ముందుంటారనేది మరోసారి రుజువైంది. ఆ స్టంట్ డబుల్ చూపిన తెగువ .. నైపుణ్యం సినిమాలోని కీలక సన్నివేశాలకు ప్రాణం పోసాయి. ప్రస్తుతం సీజీఐ వాడకం విపరీతంగా పెరిగిపోయిన తరుణంలో నోలాన్ అనుసరిస్తున్న రెట్రో-మోడరన్ అప్రోచ్ ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. డిజిటల్ గ్రాఫిక్స్ ఎంతగా అభివృద్ధి చెందినా? కెమెరా ముందు జరిగే అసలైన మేజిక్ వేరుగా ఉంటుందని నిరూపిస్తున్నారు. ఈ విధానం వల్ల నిర్మాణ వ్యయం, సమయంతో పాటు నటుల నటనలో కనిపించే సహజత్వం ప్రేక్షకులను మరింతగా కట్టిపడేస్తాయి. హాలీవుడ్ స్టూడియోల ధోరణికి భిన్నంగా ఆయన నడిచే బాట ఇతరులకు ఆదర్శంగా నిలుస్తోంది. ాశ్రీంశీ =ఘ్మ - రామాయణ ట్రీట్ గురించి కామిక్ కాన్‌లో ఏం చెప్పారంటే? ఇలాంటి భారీ బడ్జెట్ చిత్రాలను తెరకెక్కించేటప్పుడు సవాళ్లు సాధారణమే అయినా? నోలాన్ బృందం పడిన కష్టం ప్రతి ఫ్రేమ్‌లోనూ కనిపిస్తుంది. ప్రేక్షకులకు అద్భుత దృశ్య కావ్యాన్ని అందించడమే లక్ష్యంగా ప్రాజెక్ట్ రూపుది ద్దుకుందని రిలీజ్ తర్వాత ప్రేక్షకులు నిర్ధారించారు. టెక్నాలజీని గుడ్డిగా నమ్ముకోకుండా? మానవ మేధస్సుకు, సృజనాత్మకతకు పెద్దపీట వేయడం వల్ల వచ్చే ఫలితం ఎంతటి అద్భుతంగా ఉంటుందో ఈ చిత్రం మరోసారి నిరూపించింది.

Printed by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Published by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Owned by:KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Printed at:SINDHURA DARSINI PUBLICATION, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Editor: KALICHETI VENKAIAH, KADIVEDU VILLAGE AND POST, CHILLAKURU MANDAL, TIRUPATI Dist, A.P-524410. Email:SINDHURADARSINI.2023@Gmail.com, Cell:7569677170,RNI/APTEL/2023/87662